
ఆంధ్రజ్యోతి



ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద సర్వీసు రోడ్డుపై జేసీబీతో ధాన్యం ఆరబోత



అన్నదాతల్లో వణుకు

జిల్లాలో ఫెంగల్ తుఫాను అలజడి

తుఫాను హెచ్చరికలు రైతులను పరుగులు పెట్టిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా శుక్రవారం మోస్తరు వర్షం కురవడంతో కోతకు వచ్చిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. శనివారం కూడా భారీవర్షం, ఈదురుగాలులు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో మిల్లుల వైపు పరుగులు పెడుతున్నారు. ఎక్కడా సరైన సహకారం అందకపోవడంతో ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఎలా కాపాడుకోవాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు.



పైరు నేలకొరుగుతుందనే భయం

మోపిదేవి మండలం రావివారిపాలెం మిల్లు వద్ద బారులు తీరిన ధాన్యం లోడు వాహనాలు

ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు జరిగింది. ఇప్పటివరకు 25 వేల హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట కోతదశలో ఉంది. రెండురోజుల పాటు భారీవర్షం హెచ్చరికల నేపథ్యంలో ఏం జరుగుతుందోనని రైతులు బెంబేలెత్తి పోతున్నారు. మోపిదేవి మండలం వెంకటాపురం, శివరామపురం, బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ తదితర గ్రామాల్లో యంత్రాల ద్వారా వరికోతలు కోసి ధాన్యం రాశులుగా పోసి ఉంచారు.



పామర్రు వద్ద జాతీయ రహదారిపై ధాన్యపు రాశులపై పరదాలు

పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం, ఈదురుగాలులు

- వరిని కాపాడుకోవడానికి రైతుల తంటాలు
- పరదాలు కప్పి రోడ్లపైనే ఉంచిన ధాన్యపు రాశులు
- మిల్లులకు తరలించడానికి సంచుల కొరత
- కష్టపడి తరలించినా.. మిల్లుల వద్ద అవస్థలు
- జాగా లేక వెనక్కి పంపేస్తున్న మిల్లర్లు
- ధాన్యం వివరాలు ఆన్‌లైన్ చేయడానికి ఆటంకాలు
- ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నేలకొరిగిన వరి
- నేడు కూడా వర్షం కురిస్తే కష్టమే..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఫెంగల్ తుపాను రైతులను వణికిస్తోంది. దీని ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. శనివారం కూడా భారీవర్షం కురుస్తుందని, గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు కోతకోసి ఉన్న ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు పరుగులు పెడుతున్నారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రాశులుగా పోసి పరదాలు, టార్పాలిన్లు కప్పారు. సంచులు, వాహనాల కొరత కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లోని కల్లాల్లో, రహదారులపై ధాన్యాన్ని రాశులుగా పోశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ సహా పౌరసరఫరాలశాఖ రాష్ట్రస్థాయి అధికారులు, కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి రైతులకు సంచులు, వాహనాలు అందుబాటులో ఉంచాలని చెప్పినా, మధ్యవర్తులు తమదైనశైలిలోనే వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

అన్నీ సమస్యలే..

సంచులు ఇవ్వకపోవడంతో ధాన్యాన్ని కాటా వేసేందుకు వీల్లేకుండా పోయింది. ధాన్యం సంచుల్లోకి ఎత్తినా.. వాహనాలు సమకూర్చకపోవడంతో పలు ప్రాంతాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోయింది. అయినా మండలస్థాయి అధికారులు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ధాన్యం లోడుతో మిల్లుల వద్దకు వెళితే.. కూలీల కొరత కారణంగా వాహనాల నుంచి దించడానికి మిగతా 6లో..

అప్రమత్తంగా ఉండండి

- కలెక్టర్ బాలాజీ 6లో

పరిశ్రమలకు కరెంట్ షాక్

వైసీపీ హయాంలో విద్యుత్ సుంకం పెంపు

విద్యుత్ సుంకం (ఎనర్జీ డ్యూటీ) తగ్గించి పారిశ్రామిక రంగాన్ని ఆదుకోవాలని, తద్వారా సిక్ ఇండస్ట్రీ జాబితాలోకి చేరకుండా నియంత్రించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పారిశ్రామిక రంగం విజ్ఞప్తి చేస్తోంది. సిక్‌లోకి వెళ్లిన పరిశ్రమలను తిరిగి బతికించాలన్నా, ఆ జాబితాలో చేరకుండా ఉండాలన్నా ఈడీని తగ్గించాలంటోంది.

- 6 పైసల నుంచి ఏకంగా రూపాయికి..
- పరిశ్రమలపై ఒక్కసారిగా పెనుభారం
- ఉమ్మడి కృష్ణాలో నాలుగు మిల్లుల మూత
- తగ్గించాలంటూ కూటమి ప్రభుత్వానికి పారిశ్రామికవేత్తల విజ్ఞప్తి



ట్రూ అప్ చార్జీలు మరో భారం

ట్రూ అప్ చార్జీల భారం పారిశ్రామిక రంగానికి గుదిబండగా మారింది. 2014-19లో ట్రూ అప్ చార్జీలు 22 పైసలుండగా, 2023-24లో 40 పైసలకు చేరింది. ఇది విద్యుత్ వినియోగదారులపై తీవ్ర భారాన్ని మోపింది. తాజాగా 2022-23లో రూ.6 వేల కోట్ల నష్టాన్ని చూపిస్తూ 60 పైసలు, 2023-24లో పెంచని కారణంగా చవిచూసిన 11 వేల కోట్ల నష్టాలకు కలిపి రూపాయి చొప్పున విధించబోయే పరిస్థితులు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వినియోగదారులపై విద్యుత్ సుంకం అనేది ఎప్పటినుంచో ఉంది. ప్రజలపై కానీ, పరిశ్రమలకు కానీ 1964 నుంచి కేవలం ఆరు పైసలే ఎనర్జీ డ్యూటీ (ఈడీ) విధించేవారు. కొన్ని దశాబ్దాల పాటు స్థిరంగా ఉంటున్న ఈ విద్యుత్ సుంకాన్ని కిందటి వైసీపీ ప్రభుత్వంలో రూపాయికి పెంచారు. దీంతో పారిశ్రామిక రంగంపై భారం పడింది. కరోనా అనంతర పరిస్థితుల్లో ఈ విద్యుత్ సుంకం పారిశ్రామిక రంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఫలితంగా కొన్ని పరిశ్రమలు వెంటిలేటర్‌పైకి చేరాయి. భారీ యంత్రాలు వినియోగించే పరిశ్రమలు ఎక్కువగా ఈ ప్రభావానికి గురయ్యాయి. వీటిలో ఎక్కువగా స్పిన్నింగ్ మిల్లులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 95 స్పిన్నింగ్ మిల్లులు ఉంటే, అందులో 35 వరకు మూతపడ్డాయి. ఎన్టీఆర్ జిల్లాలో రెండు, కృష్ణాజిల్లాలో రెండు స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయి.

కూటమి ప్రభుత్వంలోనూ..

కిందటి వైసీపీ ప్రభుత్వం విధించిన విద్యుత్ సుంకం చార్జీలు టీడీపీ కూటమి ప్రభుత్వంలో అయినా తగ్గుతాయనుకుంటే ఇటీవల నిర్వహించిన కేబినెట్ సమావేశం ఆ ఆశ కూడా లేకుండా చేసింది. పరిశ్రమల వరకు ఈ సుంకాన్ని యథాతథంగా ఉంచాలని నిర్ణయం తీసుకోవటంతో పారిశ్రామిక రంగం షాక్‌కు గురైంది. కాగా, డిస్కమ్స్, విద్యుత్ సంస్థల అసమర్థత కారణంగా తలెత్తిన నష్టాలను పరిశ్రమలపై మోపడం తగదని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. పెంచదలచుకుంటే సహేతుకంగా ఉండేలా 10 నుంచి 12 పైసల వరకు పెంచాలంటున్నారు. అలాకాకుండా, అధికారులు చెప్పారని కిందటి ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయటం సరికాదనేది పారిశ్రామికవేత్తల వాదన.

మనుగడ కష్టమే..

ఎనర్జీ డ్యూటీ (ఈడీ)ని కిందటి ప్రభుత్వంలో రూపాయికి పెంచారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిని 12 పైసలకు తగ్గించాలని కోరుతున్నాం. పరిశ్రమలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. వీటిపై ఆధారపడి ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. సిక్ ఇండస్ట్రీస్‌ను బతికించటానికి విద్యుత్ సుంకంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. స్పిన్నింగ్ మిల్లులపై రోజుకు రూ.20 వేలు, నెలకు రూ.20 లక్షలు, ఏడాదికి రూ.2.40 కోట్ల మేర భారం పడుతోంది. ఒక స్పిన్నింగ్ మిల్లు లేదా ఏదైనా పరిశ్రమకు ఏడాదికి రూ.2 కోట్ల లాభం వస్తే.. రూ.2.40 కోట్ల చెల్లింపులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి వాటివల్ల స్వల్ప లాభాలతో ఉన్న పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం విద్యుత్ సుంక నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి.

- పి.కోటిరావు, ఏపీ చాంబర్స్ డైరెక్టర్

అర్ధరాత్రి ఇసుక దందా

రొయ్యూరులో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

తోట్లవల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొయ్యూరులో అర్ధరాత్రి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. గురువారం రాత్రి సుమారు 50 లారీల ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో లోడింగ్ చేసి బయటకు తరలించారు. ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో ఈ తతంగం జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. మూడు రోజులుగా రాత్రి సమయాల్లో ఇసుక దందాను నడుపుతున్నారని చెబుతున్నారు. అలాగే, చాగంటిపాడు, కళ్లంవారిపాలెంలో కూడా రాత్రి సమయాల్లో టీడీపీ నాయకులు ఇసుక దోపిడీ పాల్పడుతున్నట్టు సమాచారం. పగలు ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసుకుంటూ, రాత్రిపూట యంత్రాలను ఉపయోగించి లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.



గురువారం అర్ధరాత్రి రొయ్యూరు క్వారీలో ఇసుక లోడింగ్

ప్రధాన సమస్యలపై చర్చ జరిగేనా..?

జిల్లాలో పరిష్కారం కాని సమస్యలెన్నో..

- ధాన్యం కొనుగోలు, పంటకాల్వలు, డ్రెయిన్లలో పూడికతీత ఉపాధి హామీ నిధులతో పనులే ప్రధానం
- నేడు జిల్లాపరిషత్ సమావేశం

6లో

ధాన్యం కొనుగోళ్లు, ఇళ్ల నిర్మాణం, ఇసుక రేవుల్లో అక్రమాలు, వేసవిలో తాగునీటి సమస్య-పరిష్కార మార్గాలు.. కీలకమైన ఈ ప్రజా సమస్యలపై శనివారం మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాల్లో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుంది. ప్రధానమైన ఈ ప్రజాసమస్యలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, పంటకాల్వలు, డ్రెయినేజీల్లో పూడికతీత, నిధుల విడుదల తదితర అంశాలపై చర్చ కీలకం కానుంది.

మొండి బకాయిలు

దుర్గగుడి షాపులకు పెరిగిన అద్దె బకాయిలు

- వసూలులో అధికారుల మీనమేషాలు
- రూ.కోట్లలో పేరుకుపోయిన అద్దెలు

కొందరికి నోటీసుల జారీ

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానానికి చెందిన షాపుల అద్దె బకాయిల వసూలులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వెంటనే వసూలు చేయాలంటూ ఈవో కేఎస్ రామారావు పదేపదే ఆదేశాలు ఇస్తున్నప్పటికీ అధికారులు బకాయిపడిన వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు తప్ప వసూలు మాత్రం చేయట్లేదు. కనకదుర్గా నగర్‌లో మొత్తం 24 షాపులుండగా, వీటిలో 21 షాపులు వ్యాపారులకు కేటాయించారు. వీరు మొదట్లో అద్దెలు సక్రమంగానే చెల్లించినప్పటికీ ఆ తర్వాత ఆపేశారు. దీంతో ప్రస్తుతం ఈ షాపుల అద్దె బకాయిలు సుమారు రూ.2.50 కోట్లకు చేరాయి. అధికారుల తీరుపై ఈవో సీరియస్ కావటంతో తొమ్మిది మంది వ్యాపారుల నుంచి రూ.కోటి 20 లక్షలు వసూలు చేశారు. ఈ క్రమంలో అభివృద్ధి పనుల్లో భాగంగా కనకదుర్గానగర్‌లో అన్ని షాపులను ఈవో ఖాళీ చేయించారు. ఆ తర్వాత అద్దె బకాయిలు చెల్లించిన తొమ్మిది మందికే అధికారులు షాపులు కేటాయించారు. మిగిలినవారు సుమారు కోటిన్నర రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉంది. కాగా, బకాయిలు పడిన కొందరు వ్యాపారులు మళ్లీ షాపులు దక్కించుకోవటానికి అధికారులు, రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

నోటీసులు జారీ

కాగా.. గోశాల సమీపంలో ఏర్పాటుచేసిన మరికొంతమంది షాపు నిర్వాహకులకు శుక్రవారం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇక్కడ ఉన్న తొమ్మిది మంది వ్యాపారులు సుమారు రూ.50 లక్షల అద్దె బకాయి ఉన్నారు. ఈ మొత్తం వారంలో చెల్లించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో పేర్కొన్నారు. కాగా, అద్దె తగ్గించాలని కోరుతూ ఈ తొమ్మిది మంది వ్యాపారులు ఈవోకు లేఖ రాశారు. అధికారులు మాత్రం అద్దెలు చెల్లించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.

అక్రమమా.. సక్రమమా..?

రేషన్ మాఫియాకు అధికారుల పరోక్ష సహకారం



- జిల్లాలో పట్టుబడిన పీడీఎస్ బియ్యానికి వేలం
- వేలంలో పాల్గొంటున్నది అక్రమ వ్యాపారులే..
- ఆక్షన్ సర్టిఫైడ్ రశీదుతో బియ్యం మళ్లీ వారి చేతికే..
- అధికారికంగా సరిహద్దులు దాటిస్తున్న వ్యాపారులు
- అక్కడి నుంచి ఆఫ్రికా దేశాలకు తరలింపు
- అధికారుల ఆక్షన్‌పై వెల్లువెత్తుతున్న విమర్శలు

పేదల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ విజయవాడ సరిహద్దుల్లో ఓ వ్యాపారి అధికారుల చేతికి చిక్కాడు. ఇలా జిల్లాలో పక్కదారి పడుతున్న బియ్యాన్ని పట్టుకుంటున్న సివిల్ సప్లయిస్ అధికారులు వాటికి బహిరంగంగా వేలం వేస్తున్నారు. ఈ వేలంలో బియ్యాన్ని ఎవరైతే వ్యాపారి పక్కదారి పట్టించాడో అతడో లేక అతడి బినామీనో పాల్గొంటున్నాడు. ఇలా పట్టుబడిన బియ్యం చివరికి ఆ వ్యాపారే పాడుకుంటున్నాడు. ఈసారి వేలంపాట ద్వారా వచ్చిన సర్టిఫైడ్ రశీదుతో సదరు వ్యాపారి స్వేచ్ఛగా ఆ బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నాడు. ఇంతా జరుగుతున్నా.. అన్నీ తెలిసిన సివిల్ సప్లయిస్ అధికారులు అక్రమార్కులకు సహకరిస్తుండగా, అసలు ఈ వేలం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అధికారుల తనిఖీల్లో పట్టుకున్న రేషన్ బియ్యానికి ఆక్షన్ వేసే ముసుగులో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. పట్టుకున్న పీడీఎస్ బియ్యానికి సివిల్ సప్లయిస్ అధికారులే గంపగుత్తగా వేలం వేస్తున్నారు. ఈ వేలానికి అక్రమ బియ్యం వ్యాపారులే తమ బినామీలను పంపుతున్నారు. వారితో పాట పాడిస్తున్నారు. ఫలితంగా ఆ బియ్యం మళ్లీ అక్రమ వ్యాపారుల చేతికే మిగతా 6లో..

వంద శాతం పూర్తిచేయండి

- 2,31,127 పింఛన్లు.. రూ.97.93 కోట్లు విడుదల
- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ దిశా నిర్దేశం



కృష్ణలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 1 ఆదివారం నేపథ్యంలో ముందురోజే నవంబరు 30న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, తొలిరోజే వందశాతం పంపిణీకి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో పింఛన్ల పంపిణీపై కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో వుంచుకొని సమస్యలుంటే వెంటనే సరిదిద్ది ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని, జిల్లాలో 2,31,127 లబ్ధిదారులకు రూ.97.93 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వివిధ కారణాల వల్ల రెండు నెలల పాటు వరుసగా పింఛన్ తీసుకోకపోయినా మూడో నెలలో ఆ మొత్తాన్ని ఒకేసారి చెల్లించేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. పింఛన్ లబ్ధిదారు మరణిస్తే అతడి భార్య మరుసటి నెల నుంచే స్పౌజ్ పెన్షన్ (వితంతు పెన్షన్) పొందేలా వీలు కల్పించినట్టు వివరించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రామానాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

గౌరవప్రదమైనది ఉపాధ్యాయ వృత్తి

- ప్రగతి కోచింగ్ సెంటర్ సందర్శనలో మంత్రి నిమ్మల

పామర్రు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు కాబోయే ఉపాధ్యాయులుగా, సమాజ నిర్మాతలుగా రాణించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పామర్రు ప్రగతి డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా అభ్యర్థులకు అందిస్తున్న శిక్షణపై మంత్రి ఆరా తీశారు. ఉపాధ్యాయుడిగా తాను సుదీర్ఘకాలం పనిచేశానని చెప్పారు. ఎవరు ఎంతటి హోదాలో ఉన్నా గురువు వద్ద పాఠాలు నేర్చుకున్నవారేనని గమనించాలన్నారు. ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా మాట్లాడుతూ, డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు త్వరలో జరగనున్న పరీక్షల్లో ఉత్తీర్ణులై భవిష్యత్తు తరం విద్యార్థులకు చక్కటి విద్య నందించాలని కోరారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు సనకాపూర్ణచంద్రరావు మంత్రి, ఎమ్మెల్యేలకు స్వాగతం పలికి సత్కరించారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

విజయవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రాష్ట్రంలో 68 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడ ఆర్అండ్ఆర్, ఇరిగేషన్ క్యాడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రామిశెట్టి శ్రీలతను నియమించింది. కోనేరు రంగారావు కమిటీ ఎన్టీఆర్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎ.పద్మజను నియమించింది. నందిగామ ఆర్డీవోగా గతంలో పనిచేసిన ఎ.రవీంద్రరావును ఎన్టీఆర్ జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా నియమించింది. ఎన్టీఆర్ జిల్లాకు ఇంతకు ముందు డీఆర్వోగా పనిచేసిన వల్లభనేని శ్రీనివాసరావును సీఆర్‌డీఏ ఓఅండ్ఎం డైరెక్టర్‌గా నియమించింది. కృష్ణా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బి.మల్లయ్యను నియమించింది. విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి జీవీవీ సత్యనారాయణను డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఈడీగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడును నియమించారు.

2 నుంచి ఇగ్నో పరీక్షలు

వన్‌టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) టర్మ్ ఎండ్ పరీక్షలను డిసెంబరు 2 నుంచి వచ్చే ఏడాది జనవరి 9వరకు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ కేంద్రం సీనియర్ ప్రాంతీయ సంచాలకుడు దోనేపూడి రామాంజనేయ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విజయవాడ పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతరపురంలలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హాల్ టిక్కెట్లు ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడు చేసుకోవచ్చని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తమ తమ అధ్యయ కేంద్రాలను థీయరీ పరీక్షల అనంతరం సంప్రదించాలని తెలిపారు. వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని, ఈ మెయిల్ ద్వారా గాని, 0866-2565253 నెంబర్‌లోగాని సంప్రదించవచ్చన్నారు.

అన్నదాతల్లో వణుకు

(5వ పేజీ తరువాయి)

ఆలస్యమవుతోంది. దీంతోపాటు ఇప్పటికే తమ మిల్లుల వద్ద పరిమితికి మించి ధాన్యం దిగుమతి చేసుకున్నామని, జాగా లేదని, వాహనాల నుంచి దించేదిలేదని మిల్లర్లు చెబుతున్నారు. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు, పామర్రు, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు బలమైన గాలుల కారణంగా ఇప్పటికే నేలకొరిగింది. శనివారం కూడా వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తే వరిపైరు మరింతగా నేలకొరుగుతుందని రైతులు భయపడిపోతున్నారు. నేలవాలిన పంటపై వర్షపునీరు చేరితే దెబ్బతింటుందంటున్నారు. కాగా, రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేసే పనులు చేస్తున్నారు. వీరికి శనివారం సామాజిక పింఛన్లు అందజేసే బాధ్యతలను అప్పగించారు. దీంతో శనివారం ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేసే పనికి కొంతమేర ఆటంకం కలిగింది. వీఏవోలకు పెన్షన్ పని నుంచి మినహాయింపు ఇచ్చి, రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

కలెక్టర్ పరిశీలన

తుపాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మచిలీపట్నం మండలం సుల్తానగరంలోని రైస్‌మిల్లును, ఎస్ఎన్ గొల్లపాలెంలోని రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ధాన్యం ఆన్‌లైన్ చేయడం, ట్రక్‌షీట్ జనరేట్ చేయడం, వాహనాలను సమకూర్చడంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి, అధికారులకు సూచించారు. ఉయ్యూరు మండలం చినఓగిరాలలోని రైస్‌మిల్లును, రైతుసేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కంకి పాడు మండలం పొద్దుటూరు వద్ద బాలాజీ రైస్‌మిల్లును తనిఖీ చేశారు.

కలెక్టర్ లక్ష్మీశను కలిసిన ఎంపీ కేశినేని చిన్ని



వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు జి.లక్ష్మీశను శుక్రవారం ఆయన చాంబర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు.

వరికి వాన గండం!

ఫెంగల్ హెచ్చరికలతో అన్నదాతల్లో వణుకు

- రహదారుల వెంబడి గుట్టలుగా ధాన్యం
- అకాల వర్షంతో తీవ్ర అవస్థలు



మోపిదేవిలో ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్న రైతులు



పామర్రులో జాతీయ రహదారిపై రాశులు పోస్తున్న ధాన్యం

ఆరుగాలం కష్టించి పండించిన పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాత గుండెల్లో తుపాను హెచ్చరికలు రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఈ ఏడాదైనా దిగుబడులు ఆశించిన మేర వస్తాయనుకుంటున్న తరుణంలో అకాల వర్షాలతో బెంబేలెత్తుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా కోసిన పంటను రోడ్లపైనే రాశులుగాపోసి ఆరబెడుతు పంటను రక్షించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం నిబంధనలు ఒకవైపు.. వాయుగుండం, తుపాను హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మోపిదేవి/పామర్రు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి మండలంలో పలుగ్రామాల్లో యంత్రాల ద్వారా వరికోతలు, నూర్పిడి పనులు చేపట్టారు. ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం నిబంధన పెట్టడంతో రైతులు రోడ్ల వెంబడి గుట్టలుగా పోసి ఆరబెడుతున్నారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయటంతో రైతులు చేతికందివచ్చిన పంటను యంత్రాల ద్వారా నూర్పిడి చేపట్టారు. తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు సూచిస్తున్నా రైసుమిల్లర్లు, రైతు సేవాకేంద్రాల్లో తేమశాతం నిబంధన సాకు చూపుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మండలంలో పెదకళ్లేపల్లి, వెంకటాపురం, శివరామపురం, కొక్కిలిగడ్డ, పెదప్రోలు, బొబ్బర్లంక గ్రామాల్లో వందల కొద్ది ఎకరాల్లో యంత్రాల ద్వారా నూర్పిడి చేశారు. ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయటంతో మిల్లుల వద్ద సరిపడిన స్థాయిలో డ్రైయర్లు లేకపోవటంతో నిల్వచేసే సామర్థ్యం తక్కువగా ఉండటం, బారులు తీరిన వాహనాలు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పామర్రులో ఐదురోజుల క్రితం కోతలు కోసి ఆరబెట్టిన పనలు

సంచుల కొరతతో అవస్థలు..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు సంచుల అందించటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నూర్పిడి చేస్తున్నా విస్తీర్ణానికి సరిపడా గోనె సంచులు సరఫరా కావటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో సంచులు కొరత ఉందని, ధాన్యాన్ని పొలాల్లోనే ఆరబోసుకోవాల్సి వస్తుందని, రెవెన్యూ, వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా ఇదిగో వస్తాయంటూ దాట వేస్తున్నారని తెలిపారు. కనీసం గోనె సంచుల్లో ఎత్తుకుని నిల్వ చేసుకుందామనుకున్నా సంచులు సరఫరా చేయటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సరిపడా గోనె సంచులు, వాహనాలు సమకూర్చి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● పామర్రు మండలంలో రైతులు వరికోతలను కూలీలతోపాటు యంత్రాలతో యుద్ధ ప్రాతిపాదికన కోతలు కోసి నూర్పిళ్లను పూర్తి చేశారు. పనలు ఆరబెట్టారు. శుక్రవారం సాయంత్రం ఓమాదిరి వర్షాలతో పాటు ఈదురు గాలులకు వరిచేలు 25శాతం మేర నెలకొరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు మండలంలో పెదమద్దాలి, పామర్రు, బల్లిపర్రు, రిమ్మనపూడి, జమీగోల్వేపల్లి, పసుమర్రు, జమీదగ్గుమిల్లి తదితర గ్రామాల్లో కూలీలతో కోసిన వరి పనలు వర్షానికి చిక్కుకుంటున్నాయని రైతులు ఆందోళనతో ఉన్నారు. పంటను కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని అధికారులను కోరుతున్నారు.

కోతలు వాయిదా వేసుకోండి : తహసీల్దార్

తుపాను హెచ్చరికల నేపథ్యంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతల పనులు వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ గూడపాటి రవికాంత్ కోరారు. శుక్రవారం ఆయన గ్రామాల్లో పర్యటించారు. మూడురోజులు పాటు వర్షాలు పడే సూచనలున్నాయని రైతులు కోతలను నిలుపుదలచేసుకోవాలని, ఇప్పటికే కోతలు పూర్తయిన వారు మిల్లులకు తరలించాలని తెలిపారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అప్రమత్తంగా ఉండండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం తరలింపులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలోని దావులూరు, ప్రొద్దుటూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కోతలు కోసి ఆరబోసిన ధాన్యాన్ని తక్షణం మిల్లులకు తరలించేందుకు అవసరమైన అన్నిచర్యలు చేపడతున్నామన్నారు. వారంరోజులుగా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు ధాన్యం తరలింపులో కృషి చేస్తున్నారని, రైతులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. మిల్లులకు వచ్చిన వాహనాలను తక్షణం అన్‌లోడు చేయించే విధంగా కృషి చేయాలని మిల్లర్లను కోరారు. తహసీల్దార్ భవన్నారాయణ, వ్యవసాయశాఖ అధికారి పీఎం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రంలో ధాన్యం సేకరణ పరిశీలన



ఉయ్యూరు : చిన ఓగిరాల రైతు సహాయకేంద్రాన్ని కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో హెలా షారోన్ శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. చినఓగిరాలలో పర్యటించి రైతు సహాయ కేంద్రంవద్ద రైతులతో మాట్లాడారు. ధాన్యం తరలించేందుకు వాహనాలు వస్తున్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. తుపాను కారణంగా రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టామని కలెక్టర్ అన్నారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐ యతేంద్రియులు, ఏవో నిస్సీగ్రేస్, సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ నాటికి సురక్షిత కృష్ణా జలాలు!

- కిడ్నీ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు
- ఎ.కొండూరులో కలెక్టర్ లక్ష్మీశ పర్యటన.. పైప్‌లైన్ పనులపై ఆరా



ఎ.కొండూరులో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే కొలికపూడి

ఎ.కొండూరు/రెడ్డిగూడెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని 38 కిడ్నీ ప్రభావిత గ్రామాలకు జూన్ నాటికి శాశ్వత ప్రాతిపదికన సురక్షితమైన కృష్ణా జలాల అందజేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రూ.50 కోట్లతో చేపట్టిన పనులు త్వరగతిన పూర్తిచేయనున్నట్టు చెప్పారు. శుక్రవారం మండలంలో కలెక్టర్ పర్యటించారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో నిర్మిస్తున్న వాటర్‌ట్యాంక్ పనులు, ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఆయన పరిశీలించి కిడ్నీ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. కంభంపాడులో కృష్ణా వాటర్ పైపు లైన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవాలు అందించేందుకు ఎ.కొండూరులో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రోగులకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో 13 రకాల మందులు ఉచితంగా అందజేస్తున్నామని, వైద్యులు, అపోలో సిబ్బంది నెలలో రెండుసార్లు రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రూ.50 కోట్లతో చేపట్టిన జలజీవన్ మిషన్ పైపులైన్ పనులు 90 మీటర్లు పూర్తికాగా, 22 కి.మీ పనులు తుది దశకు చేరాయన్నారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో అదనంగా మరో 14 ట్యాంక్‌లు నిర్మిస్తున్నట్టు తెలిపారు.



రెడ్డిగూడెంలో కృష్ణాజలాల పనుల పురోగతిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కేజీబీవీ పాఠశాల పరిశీలన..

ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని బాలికలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. పాఠశాల తరగతి గదులు, భోజన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆర్డీవో కె.మాధురి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఇతర అధికారులు, నేతలు పాల్గొన్నారు.

అక్రమమా.. సక్రమమా?

(5వ పేజీ తరువాయి)

చిక్కుతోంది. ఇలాంటపుడు అక్రమ బియ్యం రవాణాపై విజిలెన్స్ ఎందుకు? తనిఖీలుచేసి ఎందుకు పట్టుకోవటం? పట్టుకున్న పేదల బియ్యాన్ని మళ్లీ దొంగలకు ఎందుకు ఇవ్వడం? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

స్వేచ్ఛగా సరిహద్దులు దాటించేస్తూ..

ఈ ఆక్షన్ వల్ల బియ్యం వ్యాపారులు మరింత దర్జాగా రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు. ఆక్షన్‌లో కొన్నవారిని సివిల్ సప్లయిస్ అధికారులు సర్టిఫై చేస్తూ అధీకృతంగా రశీదులు ఇస్తారు. ఈ రశీదులతో దర్జాగా రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ రశీదుల జిరాక్సులు తీసుకుని బియ్యం తరలించే ప్రతిసారీ వినియోగిస్తున్నారు. నగరం నుంచి ఆఫ్రికా దేశాలకు ఈ బియ్యం రవాణా సాగుతోంది. తాజాగా కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు వెళ్తున్న రేషన్ బియ్యం కంటైనర్‌షిప్‌ను అధికారులు పట్టుకున్నారు. ఈ కంటైనర్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన రేషన్ బియ్యం కూడా కొంతమేర ఉందని తెలుస్తోంది. సివిల్ సప్లయిస్ ఇచ్చే ఆక్షన్ రశీదు కాపీలను చూపించే ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించారు. పోలీసుల తనిఖీలు ఎక్కువగా ఉన్నాయన్న ఉద్దేశంతో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి రూటు మార్చి విజయవాడ నుంచి వయా ఛత్తీస్‌గఢ్ మీదుగా ముంబయి పోర్టుకు తరలించి, అక్కడి నుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఆక్షన్ రశీదులు చూపించి..

బియ్యం అక్రమంగా రవాణా చేయడానికి ఆక్షన్‌లో సివిల్ సప్లయిస్ అధికారులు ఇచ్చే రశీదులే కారణంగా తెలుస్తోంది. దీంతో అవినీతి రేషన్ సామ్రాజ్యాన్ని విస్తరించటానికి దోహదపడుతున్న ఆక్షన్‌ను ఎందుకు నిర్వహించాలనే అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ప్రభుత్వ స్థాయిలో సమీక్ష చేసి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. రేషన్ మాఫియాను కొంతవరకైనా కట్టడి చేయటానికి ఈ విధానాన్ని ఎత్తివేయాలనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా ప్రభుత్వానికి కూడా కొంతమేర ఆర్థిక ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుంది. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు అందిస్తే ప్రొక్యూర్‌మెంట్ భారం కొంతవరకైనా తగ్గుతుంది. ఆన్‌లైన్ రికార్డ్ నిర్వహిస్తూ వాటిని కోటాగా పంపిణీ చేయించటం వల్ల అక్రమార్కుల రీ సైక్లింగ్ వ్యాపారానికి చెక్ పెట్టొచ్చు. ఆక్షన్‌లో కొన్న బియ్యాన్ని అక్రమ వ్యాపారులు మిల్లులకు తరలించి పాలిష్ పట్టిస్తున్నారు. ఈ బియ్యాన్నే సన్నబియ్యంగా మార్చి సొంత బ్రాండ్లతో మార్కెట్‌లోకి వెదజల్లే అక్రమ వ్యాపారులు కూడా ఉన్నారు. ఇంత అవినీతికి ఆస్కారంగా మారుతున్న ఆక్షన్‌ను తక్షణం రద్దు చేయాల్సిన అవసరం ఉంది.

జలవనరుల శాఖ ఎస్ఈగా మోహనరావు

విజయవాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్ఈగా రాచప్రోలు మోహనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ధవళేశ్వరం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇంతకుముందు కేఈ డివిజన్ ఈఈగా పనిచేశారు. ఇక్కడి నుంచి ధవళేశ్వరం బదిలీపై వెళ్లారు. మొన్నటి వరకు స్పెషల్ డివిజన్ ఈఈగా ఉన్న గంగయ్య ఎఫ్ఏసీ ఎస్ఈగా ఉండేవారు. ఆయన ఈ పదవిలో కొనసాగలేనని చెప్పడంతో మోహనరావుకు ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు.

పెళ్లికి ఒప్పుకోలేదని యువతి ఆత్మహత్య!

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదని చిట్టినగర్‌కు చెందిన ఓ యువతి (19) తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలోని రైవస్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు శుక్రవారం గవర్నర్‌పేట స్టేషన్‌లో కేసు నమోదైంది. చిట్టినగర్‌కు చెందిన యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడిని ప్రేమించింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే యువకుడి తల్లిదండ్రులు వారిపెళ్లికి అంగీకరించలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె 26వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆమె భోజనం చేసి నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం తల్లిదండ్రులు లేచిచూడగా యువతి కనిపించలేదు. దీంతో అన్నిచోట్ల వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు రైవస్ కాలువలో యువతి దూకినట్టు స్థానికుడు ఆమె తల్లిదండ్రులకు చెప్పాడు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు, పంటకాల్వలు, డ్రెయిన్లలో పూడికతీత, ఉపాధి పనులు

చర్చకు రానున్న ప్రధాన సమస్యలు

- నేడు జెడ్పీ సమావేశం



(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జడ్పీ కన్వెన్షన్ హాలులో శనివారం ఉదయం 10గంటలకు జరగనుంది. జిల్లాలో నెలకొన్న ధాన్యం కొనుగోళ్లు, గృహాల నిర్మాణం, ఇసుకరేవుల్లో జరుగుతున్న అక్రమాలు, వేసవిలో తాగునీటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర ప్రధాన ప్రజాసమస్యలపై సమగ్రంగా చర్చించి, సానుకూల నిర్ణయాలు ఈ సమావేశంలో తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో రహదారుల అభివృద్ధితోపాటు పంటకాలువలు, డ్రెయినేజీలలో పూడికతీత, నిధుల విడుదల తదితర అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలుపై చర్చ..

జిల్లాలో ప్రస్తుతం వరికోతలు ప్రారంభమయ్యాయి. మరోవైపు వాతావరణం రైతులను పరుగులు పెట్టిస్తోంది. ధాన్యం కొనుగోలులో తేమశాతం సాకుగా చూపి దళారులు, మిల్లర్లు ధాన్యం మద్దతు ధరలో కోతలు పెడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు బయటి జిల్లాలకు తక్కువధరకే ధాన్యం విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పౌరసరఫరాశాఖ జిల్లా మేనేజరు, డీఎస్‌వో పోస్టులలో రెగ్యులర్ అధికారులను నియమించకుండా గత రెండేళ్లుగా ఇన్‌చార్జి అధికారులనే కొనసాగించడంపై సమావేశంలో చర్చ జరగాల్సి ఉంది.

అభివృద్ధి పనుల మాటేంటి?

ఈ ఏడాది రబీ సీజన్‌లో దాళ్వాపంటకు సాగునీటిని విడుదలచేయాలని అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరిపంటను కాపాడేందుకు జనవరి నెలాఖరువరకు సాగునీటిని విడుదలచేస్తామని చెప్పారు. 2025జూలై నెలవరకు పంటకాలువలు, డ్రెయినేజీలలో మరమ్మతుపనులపై చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

గృహనిర్మాణం, మౌలికవసతుల కల్పనపై ..

ఉమ్మడి జిల్లాలో 1400లకు పైగా లేఅవుట్లు ఉన్నాయి. వాటిలో కనీస వసతులు లేవు. ఈ లేఅవుట్లలో రహదారుల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ ఏర్పాటువంటి పనులు చేపట్టాల్సి ఉంది. డిసెంబరు నెలనుంచి కాలనీల్లో రహదారుల పనులు చేసేందుకు అవకాశం ఉంటుంది. 2025 మార్చినాటికి 3వేల పక్కాగృహాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నారు. నిధుల కొరతలేకున్నా నిర్మాణంలో అంతగా పురోగతి కనిపించడంలేదు. వివిధ విభాగాల్లో పరిపాలనాపరంగా నెలకొన్న సమస్యలను ఎత్తిచూపుతామని సభ్యులు అంటున్నారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి..

కూటమిప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. తోట్లవల్లూరు మండలంలోని ఇసుక క్వారీలనుంచి ఇసుకను తెచ్చుకునేవారి నుంచి నదిలో వాహనాల రాకపోకలకు ధారిఖర్చుల పేరుతో వసూళ్లదందాను కొందరు కొనసాగిస్తున్నారు. రొయ్యూరు క్వారీనుంచి టిప్పర్ల ద్వారా రాత్రి సమయంలో ఇసుకను తరలించుకుపోతున్నారు.

మరోవైపు ఇసుకమేటల తొలగింపు పేరుతో ఇసుకను తవ్వేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదు. చల్లపల్లి తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో ఇసుక అక్రమరవాణాదారులు రెవెన్యూ సిబ్బందిపై దాడులకు తెగబడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గతంలో జరిగిన జెడ్పీ సమావేశానికి ఎన్టీఆర్‌జిల్లాకు చెందిన శాసనసభ్యులు హాజరుకాలేదు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114,123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 605

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం: జనసేన

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రూ. 4500 కోట్లతో రహదారులు, డ్రెయిన్లు అభివృద్ధి చేసి చూపించామన్నారు. పెనమలూరు వైసీపీ నాయకుడు దేవభక్తుని చక్రవర్తి ఇష్టానుసారం మాట్లాడం సరికాదన్నారు. ఈ సమావేశంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు సుంకర శివ, బోయిన నాగరాజు, అడపా నాగశ్రీ, కోన జనార్దన్, జక్కా రఘు, ముప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడులో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడులోని 16 వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడతున్నామని ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. స్థానిక పుల్లల అడితి సందులో తాగునీటి ఇబ్బం దులను శుక్రవారం కార్యదర్శి శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సంద ర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, పుల్లల అడితి సందులో తాగునీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమం లో గ్రామస్థులు బాకి బాబు, సునీల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చోరీల తీరుపై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు బృందం

అప్రమత్తంగా వుండాలి

ఉంగుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన చిల్లరదుకాణాలు, తోపుడుబండ్లపై చిరువ్యాపారాలు నిర్వహించే ఒంటరి మహిళలు చైన్ స్నాచర్ల విషయంలో అప్రమత్తంగా వుండాలని, మెడలో ధరించిన బంగారు గొలుసులు, ఇతర నగలు చైన్ స్నాచర్లు లాక్కెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆత్కూరు ఎస్సై చావా సురేష్ సూచించారు. రోడ్డు పక్కన వివిధ రకాల చిరువ్యాపారాలు నిర్వహిస్తున్న ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకుని వారి మెడలలో వున్న బంగారు గొలుసులు తెంపుకుపోతున్న సంఘటనలు పరిసర ప్రాంతాల్లో జరిగిన దృష్ట్యా ఎస్సై తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఆత్కూరు, పెదఅవుటపల్లి, పొట్టిపాడు, తేలప్రోలు తదితర గ్రామాల్లో ప్రత్యేక పగటి పహారాలు నిర్వహించారు. బంగారు గొలుసులు చైన్ స్నాచర్ల పాలుకాకుండా ఒంటరి మహిళలు అప్రమత్తంగా వుండాలని ఎస్సై సూచించారు.

రేషన్ డీలర్ల నియామకానికి చర్యలు

ఉంగుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా వున్న 9 రేషన్ డీలర్ల నియామకాన్ని శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు గుడివాడ ఆర్డీవో చర్యలు చేపట్టారని, అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జాలాది విమలకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో మొత్తం 41 రేషన్‌దుకాణాలుండగా, అందులో 32 దుకాణాలకు రెగ్యులర్ డీలర్లు ఉన్నారని, మిగిలిన తొమ్మిది దుకాణాల్లో డీలర్ల నియామక ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

విద్యతోనే వ్యక్తిత్వ వికాసం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. ఆరుగొలను హైస్కూల్ హెచ్‌ఎం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మానవత సంస్థ సహకారంతో శుక్రవారం విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్ నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యదర్శి గణేష్, డైరెక్టర్లు రాజేశ్వరరావు, రామచంద్ర రావు, ఉపాధ్యాయులు తాతబాబు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

ఉయ్యూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో బీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకట రెడ్డి ముందంజలో ఉంటారని బీవీఆర్ యూత్ అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్, సుబ్బారెడ్డి అన్నారు. ఏజీ అండ్ ఎస్‌సీఎస్ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ చదువుతున్న గరికపర్రుకు చెందిన లుక్కా కార్తీక్ కళాశాల ఫీజు, ఇతర అవసరాల నిమిత్తం వెంకటరెడ్డిని ఆర్థిక సాయం కోరగా సానుకూలంగా స్పందించిన ఆయన రూ. 22వేలు బీవీఆర్ యూత్ ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విశిష్టమైనది ఆయుర్వేదం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 29(ఆంధ్ర జ్యోతి) : కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యసేవల అభివృద్ధికి మాజీ జెడ్పీటీసీ సుంకర సుభాస్‌చంద్రబోస్ రూ.50వేలు, లింగం రమేష్ రూ. 10వేలు విరాళాలను శుక్రవారం డాక్టర్ వాహినికి అందజేశారు. వైద్యశాలలో నిర్వహిస్తున్న పంచకర్మ లాంటి ఖర్చుతో కూడిన వైద్యాన్ని సామాన్యులకు చేరువ చేసేందుకు తమ వంతు సహకారంగా విరాళం అందజేసినట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతల వెంకటశివఅప్పారావు, దన్నే దుర్గారావు, తాడి రంగారావు, వేగిరెడ్డి బాలాజీ, చలమలశెట్టి చలపతిరావు, బయ్యా రత్న గాంధీ, తదితరులు పాల్గొన్నారు.


గండిగుంట వద్ద సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం.. తెంపల్లిలో ధాన్యాన్ని తిరగేస్తున్న రైతు కూలీలు.. నాగవరప్పాడులో ధాన్యం రాశులు

వణికిపోతున్న వరి రైతు!

- వాతావరణంలో మార్పులు
- రోడ్లపైనే కోత కోసిన ధాన్యం
- ఎండా, మబ్బులతో రైతుల ఉరుకుల, పరుగులు
- మరో వైపు కూలీల కొరత

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఫెంగల్ తుఫాన్ హెచ్చరికలు, వాతావరణ మార్పులతో వరికోతలు కోసిన రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు వణికిపోతున్నారు. కొద్దిసేపు ఎండకాసి కొద్దిసేపు మబ్బుతో వానతుంపర్లు రావడతో రోడ్లపైన, ఖాళీ ప్రదేశాల్లో ఆరెబెట్టిన ధాన్యం పోగుజేసి పట్టాలు కప్పుకుంటూ అవస్థలు పడుతున్నారు. ఎండా మబ్బులు దోబుచులాడుతూ ధాన్యం ఆరబెట్టిన రైతులతో ఆడుకుంటుంటే పోగుచేసిన ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి గోనె సంచులు, లారీల కోసం ఎదురు చూస్తున్నారు. గండిగుంట, చినఓగిరాల, పెదఓగిరాల, ఆకునూరు, కడవకొల్లు పరిసర గ్రామాల్లో దేవుడిపై భారమేసి ఏదైతే అయ్యిందన్న భావనతో యంత్రాలతో వరికో తలు కోయిస్తున్నారు. ఇదిలా ఉండగా ధాన్యం ఆరబెట్టి పోగుచేసి రాశి చేసేందుకు కూలీల కొరత, అధిక కూలీరేటు తట్టుకో లేక కొందరు రైతులు యంత్రాలు ఉపయోగించి ఆరబెడుతూ బాధలు పడుతున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు : రైతులను చెస్ పేరుతో ఇబ్బందులు పెట్టొద్దు అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మార్కెట్ కమిటీ అధికారులను కోరారు. బట్లపెనుమర్రుకు చెందిన ధాన్యం లోడును నెప్పల్లి చెక్ పోస్టు వద్ద ఏఎంసీ అధికారులు శుక్రవారం సాయంత్రం ఆపారు. ధాన్యం లోడుకు ట్రక్ షీటు లేకపోవడంతో చెస్ కట్టాలంటూ అధికారులు రైతును డిమాండ్ చేశారు. ఓ పక్క వర్షం కురుస్తుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారని, ఇపుడు చెస్ కట్టమంటే ఎలాంటూ రైతులు సంబంధిత అధికారుల వద్ద వాపోయారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హుటాహుటిన నెప్పల్లి చెక్ పోస్టు వద్దకు చేరుకున్నారు. తుపాను హెచ్చరికలతో దొరికిన కాడికి రైతులు వాహనాలను సర్దుబాటు చేసుకొని ధాన్యం తరలించుకునే పనిలో ఉన్నారని, అటువంటి రైతులను ఈ రెండు రోజుల పాటు ఇబ్బందులు పాలు చేయవద్దని ఏఎంసీ సిబ్బందిని ఆదేశించారు. అటు రైతులు, ఇటు వ్యవసాయ కమిటీ అధికారులతో మాట్లాడి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు కృషి చేశారు.


నెప్పల్లి చెక్‌పోస్టు వద్ద ఏఎంసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

తుఫాన్ హెచ్చరికలతో భయాందోళన

గన్నవరం : తుఫాన్ గండంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. కల్లాల్లో ధాన్యం ఉండటంతో రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. వరదలను తట్టుకుని పంట పండిస్తే విక్రయించే సమయానికి తుఫాన్ హెచ్చరికలతో భయాందోళన చెందుతున్నారు. మండలంలోని తెంపల్లి, వీరపనేనిగూడెం, ముస్తాబాద, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో రైతులు వరికోత యంత్రాలతో పంటను కోసి రోడ్డుకు చేర్చారు. పగలు ఆరబెట్టుకుని సాయంత్రం పరదాలు కప్పుకుంటున్నారు. అసలే వ్యవసాయ ఖర్చులు పెరిగాయి అనుకుంటుంటే నాలుగైదు రోజులు పైబడి ఆరబెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● పంట కోసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి వై.రజిని రైతు లకు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

ఉంగుటూరు : తుఫాన్ ప్రభావం కృష్ణాజిల్లాకు కూడా ఉన్నందున రైతులు అప్రమత్తంగా వుండాలని, వరికోతలు రెండురోజులపాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వీవీఎస్‌ఆర్‌ఎస్ హరీష్‌కుమార్ రైతులకు సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులను అప్రమత్తంచేసేందుకు ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావుతో కలిసి శుక్రవారం మండలంలోని ఇందుపల్లి, నాగవరప్పాడు, ఎలుకపాడులో ధాన్యపురాశులను పరిశీలించారు.


మాట్లాడుతున్న గూగుల్ మ్యాప్ రూపకర్త తుమ్మల నారాయణ

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాల్సిన అవసరముందని గూగుల్ మ్యాప్ రూపకర్తల్లో ఒక్కరైన తుమ్మల నారాయణ అన్నారు. మండలంలోని తెన్నేరు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం తెన్నేరు 1985 - 86 పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్ర మానికి హాజరైన పూర్వ విద్యార్థి నారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యల భిస్తోందన్నారు. అనంతరం 85 - 86లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు అనంతాచార్యులు, శ్రీనివాస్, సుశీలను ఘనంగా సత్కరించారు. పాఠశాలకు అవసరమైన కలర్ ప్రింటర్‌ను, కాస్కోబాల్స్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెలివల రాజశ్రీ, హేమ, వై. ఎస్.వి. సత్యనారాయణ, రాంబాబు, వేమూరి జయప్రసాద్, గాయత్రి, వల్లభనేని సుశీల పాల్గొన్నారు.


శాశ్వత సభ్యత్వం తీసుకొంటున్న అన్నే శివనాగేశ్వరరావు తదితరులు

తెలుగు ప్రజల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

పెనమలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల అభ్యున్నతే టీడీపీ ప్రధాన లక్ష్యమని, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో టీడీపీ ప్రముఖులు తోటకూర సూరిబాబు, బొబ్బా గోపాలకృష్ణ, అన్నే శివనాగేశ్వరరావులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకొనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, అంగిరేకుల మురళీకృష్ణ, టీడీపీ వాసు, యేనుగ శ్రీనివాస్, వడ్లమూడి శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

●పోరంకి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఐదు లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. గంగూరు గ్రామానికి చెందిన నాదెళ్ల జగజ్జీవనరావుకు రూ. రెండు లక్షలు, పోరంకికి చెందిన బొల్లా దర్శినికి రూ. మూడు లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

●నియోజకవర్గ స్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం యనమలకుదురు చినవంతెన ఆంజనేయస్వామి గుడి నుంచి జరిగిన పల్లెప్రగతి పాదయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కార్మికులకు న్యాయం చేయాలి: సీఐటీయూ

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుని కూలి చెల్లించని వారిపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్ నిర్మాణంలో తాపి పని చేసిన కార్మికులకు డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి మూడవ రోజుకు చేరాయి. సీఐటీయూ నాయకులు బడుగు మరియదాసు, మిరప నాగేశ్వరరావు, చెరువుగట్టు ప్రసాద్, బాబు, హసీనా నాగూర్ భాషా, సతీష్, దాసు, తేజ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ ఎమ్మెల్యే సార్!

- సామాజిక మాధ్యమాల్లో సమస్యలపై మొర
- తక్షణం స్పందించి.. పరిష్కరించిన యార్లగడ్డ

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారికి సంబంధించిన సమస్యలపై నియోజకవర్గ ప్రజలు ప్రస్తావించిన అంశాలపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పందించిన తీరుపై నియోజకవర్గ వాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్‌లో జాతీయ రహదారిపై రోడ్డు మధ్యలో తారు దిబ్బలుగా ఉండిపోయి ద్విచక్ర వాహన దారులకు ప్రమాద భరితంగా మారిందంటూ స్థానికుడు ఒకరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మరో వ్యక్తి.. చిన అవుటపల్లి-గొల్లపూడి బైపాస్ రోడ్డు గన్నవరం వద్ద ప్రమాదంగా ఉంది. బీబీగూడెం వద్ద జాతీయ రహదారిపై వచ్చే వాహ నాలను సర్వీస్ రోడ్డులోకి మరలిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయంటూ పోస్టు పెట్టారు. ఈ రెండు సమస్యలపై యార్లగడ్డ స్పందించి జాతీయ రహదారి పీడీకి లేఖ రాశారు. స్పందించిన అధికారులు గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న దిబ్బను తొలగించటంతో పాటు బీబీగూడెం వద్ద వేగాన్ని నియంత్రించేందుకు బారీకేడ్లను ఏర్పాటు చేశారు.



వైభవంగా కార్తీక దీపోత్సవం

విజయవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా స్వామి వారికి ఉదయం 6 గంటల నుంచి 11.30 గంటల వరకు రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి శాంతి కళ్యాణం సంగా నరసింహారావు అధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని పది రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్, ఈవో ఎన్.భవానీ పాల్గొన్నారు.



కోటి దీపోత్సవంలో అలంకరించిన లింగ, ఓంకార రూపాలు

మరకత లింగానికి విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్ : స్థానిక బాపులపాడు మల్లికార్జునస్వామి దేవస్థానంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా విశేష పూజలు నిర్వహిం చారు. ఆలయ అర్చకులు కుందుర్తి మహేష్‌కుమార్ మరకత లింగానికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్య, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, గొట్టిపాటి రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.

పెరికీడులో వైభవంగా దశసహస్ర దీపోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పెరికీడు ముక్తేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస మాస శివరాత్రి సందర్భంగా దశ సహస్ర దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్యామ్, సీతారామయ్య, మహేష్‌ల ఆధ్వ ర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజలో బొమ్ము లూరు దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ డైరెక్టర్ కొల్లి రాజశే ఖరరావు, జయలక్ష్మి దంపతులు పాల్గొని మొదటి దీపాన్ని వెలిగించారు. దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, అనురాధ దంపతులు సహకారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు నందూరి శర్మ, బాబు, శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఘనంగా లక్ష బిల్వార్చన

గన్నవరం : స్థానిక కోనాయి చెరువు సమీపంలోని విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం లక్ష బిల్వార్చన నిర్వహిం చారు. తొలుతకాశీ విశ్వేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక అష్టోత్తర శతకలశాత్మక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి రూ.50 వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.50,116లు విరాళం అందించారు. శుక్రవారం సాయి కల్యాణి తన జన్మదినం పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వేంటేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణి, సురేంద్ర దంపతులు స్వామి వారిని దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ బాబు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్ చేతులు మీదుగా విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, వడ్డిల్లి లక్ష్మీకుమారి, వాసవి పాల్గొన్నారు.





రూపాయి నోటు ప్రస్తుతం చలామణిలో లేదు. ఆ ఒక్క నోటు ధర రూ.30. రెండు రూపాయల నోటు ముద్రణ ఏనాడో ఆగిపోయింది. ఆ నోటు ధర రూ.20. సంఖ్య, విలువ పరంగా చూసినా రూపాయి, రెండు రూపాయలు తక్కువే అయినా వాటికి పలికే ధర మాత్రం ఎక్కువే ఉంటుంది. కరెన్సీ ఎంత పురాతన చరిత్ర కలిగి ఉంటే అంత ఎక్కువ ధర పలుకుతోంది. నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణపై ఆసక్తి ఉన్న వారు ఆ చరిత్రను చూసి ఎంత ధరకైనా కొనుగోలు చేస్తారు. ప్రతి కరెన్సీ వెనుక అనేక కోణాలు, తరగని చరిత్ర కనిపిస్తోంది. విజయవాడ సూర్యారావుపేటలోని చిలుకు దుర్గయ్య వీధిలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో 2024(కాయిన్స్, స్టాంప్స్ అండ్ కరెన్సీ ఎగ్జిబిషన్) శుక్రవారం ప్రారంభమైంది. ఆదివారం వరకు ప్రదర్శనను నిర్వహిస్తారు.



ప్రదర్శనలో నాణేలు, కరెన్సీ నోట్లను తిలకిస్తున్న విద్యార్థులు, ఎన్టీఆర్ నాణేన్ని చూపుతున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

నోటుకో రేటు

- విజయవాడలో కొలువుదీరిన అంతర్జాతీయ కరెన్సీ
- నగరంలో ఇంటర్నేషనల్ కాయిన్స్ ఎక్స్‌పో ప్రారంభం
- మూడు రోజులపాటు నిర్వహణ







ప్రదర్శనలో ఉంచిన అంతర్జాతీయ నాణేలు, నోట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్)

శ్రీధర్ సీసీతఃః సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో 2024(కాయిన్స్, స్టాంప్స్ అండ్ కరెన్సీ ఎగ్జిబిషన్)ను నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనను పురావస్తు శాఖ ముఖ్యకార్యదర్శి వాణీమోహన్, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, అడ్మిన్ ఐజీ శ్రీకాంత్, సుమన్ మీనా, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సందర్శించారు.

మాల్టా నాణెంపై గాంధీ చిత్రం



ప్రపంచ దేశాలు కొత్త నాణేలు, కరెన్సీని ముద్రించి విడుదల చేస్తుంటాయి. ఆయా దేశాల్లోని ప్రముఖులు, చరిత్రకారుల పేరు, చిత్రాలతో నాణేలు, కరెన్సీలను ముద్రిస్తాయి. మాల్టా దేశం కొన్నాళ్ల క్రితం 5వేల లిరాస్ నాణేన్ని విడుదల చేసింది. దీనిపై మహాత్మాగాంధీ చిత్రాన్ని ముద్రించింది. ఈ నాణెం ప్రదర్శనలో ప్రత్యేకార్షణగా నిలిచింది. దీనితోపాటు ఆస్ట్రేలియా ది ఇయర్ ఆఫ్ ది హార్స్ పేరుతో విడుదల చేసిన నాణెం, కాంగో దేశం విడుదల చేసిన 25 ఫ్రాన్సెస్, 10 ఫ్రాన్సెస్ నాణేలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

ఒక రూపాయి..మూడు దేశాలు

రూపాయి, డాలర్, సీఎఫ్ఏ ఫ్రాన్స్, లెవ్, రీల్, యూరో, దినార్, పెసో... ఇవన్నీ ప్రపంచంలోని వివిధ దేశాల్లో చలామణిలో కరెన్సీ పేర్లు. ఆయా దేశాలకు వెళ్లినప్పుడు స్వదేశ కరెన్సీని అందులోకి మార్చుకోవాల్సి ఉంటుంది. మన దేశంలో ముద్రించిన కరెన్సీని కొన్ని సంవత్సరాలు బర్మా, పాకిస్థాన్ దేశాలు ఉపయోగించుకున్నాయి. 1940వ సంవత్సరంలో ముద్రించిన రూపాయి నోటును ఈ రెండు ఉపయోగించుకున్నాయి. తర్వాత సొంతంగా కరెన్సీని రూపొందించుకున్నాయి. భారతదేశం మింట్‌లో ముద్రించిన ఈ కరెన్సీ ఆ దేశాలకు వెళ్లిన తర్వాత ఆ నోట్లపై ఆ దేశం ఒక స్టాంప్ వేస్తుంది. ఆ దేశ మిలటరీ అనుమతితో వచ్చినట్టు ఇంగ్లీష్‌లో రాసి ఉం టుంది. దీన్ని ఓవర్ ప్రింట్ నోట్లుగా వ్యవహరిస్తారు.



ఆర్బీఐ గవర్నర్ సంతకాన్ని బట్టి డిమాండ్

ఒక నోటు ఎంత పురాతన చరిత్ర కలిగి ఉంటే అంత ఎక్కువ ధర పలుకుతుంది. మనదేశ నాణేలు, కరెన్సీ నోట్లు ఆర్బీఐ ద్వారా వివిధ మింట్లలో ముద్రిస్తారు. ఇందులో కరెన్సీ నోట్లపై రిజర్వ్ బ్యాంక్ గవర్నరుగా పనిచేసిన అధికారి సంతకం ఉంటుంది. ఈ సంతకాలు ఉన్న నోట్లు ఒక్కొక్కటి ఒక్కో ధర పలుకుతోంది. 1985లో ఆర్బీఐ రూ.100 నోటును విడుదల చేసింది. ఆ సమయంలో ఆర్బీఐ గవర్నరుగా మల్హోత్ర వ్యవహరించారు. ఈ సంతకం ఉన్న ఒక రూ.100 నోటు ఖరీదు రూ.300. ఈ నోటు 1990 వరకు చలామణిలో ఉంది. 1977లో ఆర్బీఐ రూ.100 నోటును విడుదల చేసింది. నాడు గవర్నరుగా ఆర్.నరసింహన్ వ్యవహరించారు. ఆయన సంతకం ఉన్న ఈ నోటు ఖరీదు రూ.6వేలు. 1970లో రూ.100 నోటును విడుదల చేసింది. ఆ సమయంలో ఆర్బీఐ గవర్నరుగా ఎస్.జగన్నాథన్ ఉన్నారు. ఆయన సంతకం చేసిన నోటు రూ.600 పలుకుతోంది.

ప్రపంచంలోనే పెద్ద నోటు



రిజర్వ్ బ్యాంకులు విడుదల చేసిన నాణెలు, కరెన్సీ నోట్లకు కొలమానాలు ఉంటాయి. ఒక్కో నాణేనికి బరువు, చుట్టుకొలత, ఉపయోగించిన లోహం వేర్వేరుగా ఉంటాయి. ప్రతి కరెన్సీ నోటుకు పొడవు, వెడల్పు ఉంటాయి. ఈ పరిమాణాలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉంటాయి. ప్రపంచంలో అతి పెద్ద కరెన్సీ నోటును మలేషియా ముద్రించింది. అక్కడ కరెన్సీని రింగేట్స్‌లో వ్యవహరిస్తారు. 600 రింగేట్స్ కరెన్సీ నోటును మలేషియా ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నోటు పొడవు 22.86, వెడల్పు 40.64 సెంటీమీటర్లు. అన్ని దేశాల కరెన్సీల్లో మలేషియా ముద్రించిన 600 రింగేట్స్ నోటు అతి పెద్దదిగా స్థానం దక్కించుకుంది.

'స్టార్' కరెన్సీ



బిట్‌కాయిన్, క్రిప్టో..ప్రపంచీకరణ తర్వాత డిజిటల్ యుగం కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో వచ్చిన కొత్త కరెన్సీలు. వాటికి ముందు నుంచే ఆర్బీఐ స్టార్ కరెన్సీని తీసుకొచ్చింది. ఇదేమి కొత్త కరెన్సీ కాదు. చలామణి అవుతున్న కరెన్సీలో ఇదొక భాగం. ఆర్బీఐ వివిధ మింట్‌ల్లో కరెన్సీ నోట్లను ముద్రిస్తోంది. రూ.10, 20, 50, 100, 500నోట్లు దేశంలోని మింట్‌ల్లో ముద్రణ చేస్తున్నారు. ప్రస్తుతం పది రూపాయల నోట్లను తగ్గించి వాటి స్థానంలో నాణేలను మార్కెట్లోకి దింపుతున్నారు. నోట్లను ముద్రించి 100 నోట్లను ఒక కట్టగా లెక్కిస్తారు. ఆ కట్టలో ఉన్న నోట్లన్నీ వరుస సంఖ్య ఉంటుంది. ఒక్కో నోట్ల కట్టకు ఒక్కో సీరియల్ నంబరు ఉంటుంది. ముద్రణ చేసే సమయంలో ఈ సీరియల్ నంబర్లలో ఏదైనా ఒక నోటు పాడైపోతే దాని స్థానంలో స్టార్ నోట్లను పొందుపరుస్తారు. అదే విలువతో ప్రత్యేకంగా నోట్లను ముద్రిస్తారు. ప్రతి నోటుకు కుడిచేతి వైపున పైభాగంలో, ఎడమ చేతి వైపున కింది భాగంలో సీరియల్ నంబరు ఉంటుంది. ఈ నంబరుకు మధ్యలో స్టార్ (నక్షత్రం) ఉంటుంది. ఈ తరహా నోట్లను స్టార్ నోట్లు, స్టార్ కరెన్సీగా వ్యవహరిస్తారు. ఈ నోటు కట్టలో చేరితే వాటిలో సీరియల్ నంబర్ ఒకటి తప్పుతుంది. అందుకోసం బ్యాంకర్లకు తెలిసేలా కట్టపై అతికించే లేబుల్‌పై స్టార్ నోట్ ఉందని ముద్రిస్తారు.

విజయసాధనకు కృషి, పట్టుదల అవసరం

» విద్యార్థులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సూచన



కలెక్టర్ డీకే బాలాజీని సత్కరిస్తున్న మానవత సభ్యులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ పాఠశాలలో చదివా. జనరల్ నాలెడ్జ్ అంశాలపై మొదటి నుంచి దృష్టి సారించా. ఆంగ్ల భాషపై పట్టు ఉండటంతో పాటు కృషి, పరిశ్రమతో ర్యాంకులు సాధించా. నా తండ్రి, స్నేహితుల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి ఎదిగా. విద్యార్థిదశలోనే జీవితంలో ఉన్నతస్థితికి ఎదిగేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలి. కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయాలు సాధించగలం.' అని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణా విశ్వవిద్యాలయం అల్లూరి సీతారామరాజు సెమినార్ హాలులో సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం కలెక్టర్ బాలాజీ రచించిన ఎథిక్స్ ఇంటిగ్రిటీ యాటిట్యూడ్ గ్రంథంపై విజయవాడ శరత్ ఐఏఎస్ అకాడమీ కౌంటర్ డైరెక్టర్ టి.శరశ్చంద్ర విశ్లేషించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి.శ్రీరామ్, కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు. ప్రముఖ చిత్రకారుడు రాజేష్ గీసిన చిత్రాన్ని కలెక్టర్ బాలాజీకి బహుకరించారు. ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ సతీమణి పృథ్వీ కల్యాణి, తండ్రి కృష్ణయ్యశెట్టి పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

» ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

మచిలీపట్నం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాకు చెందిన మంత్రులు, కూటమి నాయకులు, ఎమ్మెల్యేల సహకారంతో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ తెలిపారు. నగరంలోని ముడా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ పదవి ఇచ్చారని, వారి ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం గతంలో ముడా ఆధ్వర్యంలో రైతుల నుంచి భూములు కొనుగోలు చేశారని తెలిపారు. అమరావతికి దగ్గరగా ఉన్న బందరు పోర్టు పూర్తయితే జిల్లా అభివృద్ధి జరుగుతుందన్నారు. మచిలీపట్నాన్ని పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. ముడా పరిధిలోని భూములు, ఇతర ఆస్తులు, అప్పులపై ప్రజలకు జవాబుదారీగా ఉంటానన్నారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు ముడా కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకొస్తామని మట్టా ప్రసాద్ తెలిపారు. బీజేపీ నాయకులు పంతం గజేంద్రరావు, బొమ్మిడి గణేష్ పాల్గొన్నారు.

ఎన్నికల గోదాము తనిఖీ

కృష్ణలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి మార్కెట్‌యార్డ్ ప్రాంగణంలో ఈవీఎంలను భద్రపరిచిన జిల్లా ఎన్నికల గోదామును శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌ను, వేసిన సీల్‌లను ఈవీఎంల రక్షణకు భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమేరాల నిఘాను ఆయన పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాము క్షుణంగా తనిఖీచేసి నివేదికను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుందన్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహ, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బి.కిరణ్, పి.యేసుదాస్, కె.పరమేశ్వరరావు, వై.రామయ్య, ఎం.వినోద్‌కుమార్, పీవీ శ్రీహరి పాల్గొన్నారు.



గొల్లపూడిలో ఎన్నికల గోదాము తనిఖీ చేశాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

దేవస్థానం టూ న్యాయస్థానం

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వలంటీర్ల కార్యక్రమం

» ప్రభుత్వ పెద్దల మనసు మారాలంటూ దుర్గగుడిలో వినతిపత్రాల సమర్పణ

» స్పందించకపోతే న్యాయస్థానాల మెట్లెక్కుతామని, ఉద్యమిస్తామని హెచ్చరిక



తమ డిమాండ్లు ఆమోదించాలంటూ దుర్గగుడిలో వినతిపత్రాలు చూపుతున్న వలంటీర్లు

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ దేవస్థానం టూ న్యాయస్థానం కార్యక్రమం పేరిట వలంటీర్లు శుక్రవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంకా గోవిందరాజుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం దగ్గర ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ తమ ఉద్యోగ భద్రతపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దల మనస్సులను మార్చి తమ న్యాయమైన కోర్కెలు నెరవేరేలా చూడాలని అమ్మవారిని కోరుతూ అందులో రాశామని వలంటీర్లు తెలిపారు. టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో వలంటీర్లకు ఉద్యో గభద్రత కల్పిస్తామని, నెలకు రూ.10వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, దానిపై ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదని, అమ్మవారైనా తమ మొర ఆలకిస్తుం దని, తమ కోర్కె నెరవేరుస్తుందని విన్నవించుకున్నామన్నారు. తమ డిమాండ్లను ఆమోదించాలంటూ దేవస్థానం టూ న్యాయ స్థానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోకపోతే త్వరలో న్యాయస్థానాల మెట్లు ఎక్కుతామని, భారీ సంఖ్యలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.



11 గ్రాముల బంగారు నత్తువను అందజేస్తున్న బొడ్డు శ్రీధర్ దంపతులు

దుర్గమ్మకు కానుకగా బంగారు నత్తువ

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ ఏర్పడింది. అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్ కొత్తపేట టీవీటీ మార్కెట్ ప్రాంతంలోని శ్రీధర్ శారీ హౌస్ యజమాని బొడ్డు శ్రీధర్ శుక్రవారం తన కుటుంబ సభ్యులతో ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారి అలంకరణ నిమిత్తం ఎరుపు, తెలుపు, పచ్చరాళ్లు పొదిగిన 11 గ్రాముల నాసికాభరణం(నత్తువ)ను ఆలయ అధికారులకు అందజేశారు.

అన్నవితరణకు రూ.లక్ష విరాళం

నగరంలోని వన్‌టౌన్ సమ్మెట వారి వీధికి చెందిన పల్లపోతు వెంకట శ్రీనివాసరావు ఆలయంలో అన్నవితరణ నిమిత్తం రూ.లక్ష చెక్కును డిప్యూటీ ఈవో రత్నరాజుకు అందజేశారు.



మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీఎన్జీవో రాష్ట్ర నాయకులు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల

సమస్యలు పరిష్కరించండి

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, సీహెచ్ పురుషోత్తమనాయుడు కోరారు. శుక్రవారం మంత్రిని సచివాలయంలోని చాంబర్‌లో అసోసియేషన్ నాయకులు కలిశారు. 'గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కామన్ అపాయింట్‌మెంట్ డేట్ ఇవ్వాలి. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో సీనియారిటీ లిస్టులు తయారు చేయాలి. జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ మంజూరు చేయాలి. డేట్ ఆఫ్ జాయినింగ్ నుంచి ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. పదోన్నతులు కల్పించి ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల్లో సచివాలయ ఉద్యోగులకు అవకాశమివ్వాలి. పింఛన్ల పంపిణీలో ఉద్యోగులపై ఒత్తిడి లేకుండా చూడాలి.' అని వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. పశ్చిమ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.రమణ, కోశాధికారి రంగారావు, గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీబాషా పాల్గొన్నారు.



అభినందనలు అందుకున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యులకు ప్రశంస

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇండియా వాల్వ్స్, పీసీఆర్ టోక్యో వాల్వ్స్, పీసీఆర్ లండన్ వాల్వ్స్ వంటి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రమేష్ హాస్పిటల్స్ వైద్యులు వైద్యనిపుణుల ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 26న లండన్‌లో నిర్వహించిన పీసీఆర్ లండన్ వాల్వ్స్ సదస్సులో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నూకవరపు రాజా రమేష్ పాల్గొన్నారు. తీవ్ర లెఫ్ట్ వెంట్రికులర్ డిస్‌ఫంక్షన్ ఉన్న రోగికి అయోటిక్ కవాట మార్పిడి విజయవంతంగా నిర్వహించడంపై సదస్సులో హాజరైన సభ్యులు ప్రశం సించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడారు. 'ఏపీలో తొలిసారిగా టావి(టీఏవీఐ), మైట్రాక్లిప్ చికిత్సలను విజయవంతంగా నిర్వహించాం. ఇప్పటివరకు 30 మందికి పైగా అయోటిక్ లేదా మైట్రల్ కవాటాలను శస్త్రచికిత్స అవసరం లేకుండా ట్రాన్స్‌క్యాథటర్ వాల్వ్ రీప్లేస్మెంట్ విధానంలో విజయవంతంగా నిర్వహించాం. అంతర్జాతీయ వేదికలపై ఆస్పత్రి మరోసారి ప్రత్యేక ముద్ర వేసింది.' అని రమేష్‌బాబు తెలిపారు. తమ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ వైద్య బృందం నైపుణ్యం, కృషి వల్ల ఈ ఘనత సాధ్యమైందన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆస్పత్రి సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్ భాస్కరనాయుడు, డాక్టర్ జి.కృష్ణమోహన్, డాక్టర్ సోమనాథ్, డాక్టర్ రాజారమేష్, డాక్టర్ అనూప్, డాక్టర్ రామ్‌మనోహర్, డాక్టర్ మధుకృష్ణ, డాక్టర్ వెంకటేష్‌రెడ్డి, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ షహనాజ్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

» మంత్రి శ్రీనివాస్‌తో విజయవాడ చాంబర్ ప్రతినిధుల భేటీ

ధర్నాచౌక్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు గడ్డం బాల వెంకటరవికుమార్ నేతృత్వంలో చాంబర్ ప్రతినిధులు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చాంబర్ ఆధ్వర్యంలో వ్యాపారుల సమస్యలపై ముఖాముఖి నిర్వహిస్తున్నట్టు మంత్రికి వివరించారు. వ్యాపారులు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రతినిధుల బృందానికి మంత్రి హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డూండీ రాకేశ్, చాంబర్ ఉపాధ్యక్షుడు వీవీకే నరసింహారావు, జాలాది వెంకటేశ్వరరావు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న చాంబర్ ప్రతినిధులు

నేడు, రేపు సైక్లింగ్ టీమ్‌ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మందడం గ్రామంలో సీడ్ యాక్సెస్‌రోడ్డు వద్ద ఈనెల 30, డిసెంబరు 1వ తేదీల్లో ఏపీ సైక్లింగ్ అండర్-14, 16, 18 బాల, బాలికలు 20 ప్లస్ మహిళలు, పురుషుల టీమ్‌ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 8 గంటలకు గుడ్‌రోడ్ స్కూల్లో రిపోర్టు చేయాలన్నారు. ఇక్కడ సత్తా చాటిన వారిని డిసెంబరు 7 నుంచి 10 వరకు ఒడిసాలోని పూరిలో నిర్వహించే జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. వివరాలకు 98493 79932 సంప్రదించాలని సూచించారు.

2, 3 తేదీల్లో కౌలురైతు

సంఘం నిరసనలు

ఆటోనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని 48 గంటల్లో ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిసెంబరు 2, 3 తేదీల్లో స్థానికంగా నిరసనలు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ధాన్యం కొనుగులు కేంద్రాల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉంచాలని, ఆర్బీకేల వద్ద చూసిన తేమశాతం ఆధారంగానే ధాన్యం ధరను ఆర్బీకే వద్దే నిర్ణయించాలని డిమాండ్ చేసింది.

10న మాదిగల

కృతజ్ఞతయాత్ర ముగింపు సభ

ధర్నాచౌక్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ వేసిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు ఏబీసీడీ వర్గీకరణ చేయడం వల్ల మాదిగలకు 25 వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. గత ఎన్నికల్లో 29 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలో సగం సీట్లు మాదిగలకు కేటాయించి సామాజిక న్యాయం చేసినందుకే ఆగస్టు 16 నుంచి హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞత యాత్ర చేపట్టామన్నారు. డిసెంబరు 10న నగరంలోని ఐలాపురం కన్వెన్షన్‌లో యాత్ర ముగింపుసభ నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

సమ్మె ఒప్పందం

అమలు చేయాలి

» అంగన్వాడీ సంఘాల డిమాండ్

ధర్నాచౌక్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలను అమలు చేయాలని అంగన్వాడీ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. డిసెంబర్ 12కు సమ్మె ప్రారంభించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుస్థాయిలో నిరసన, ప్రదర్శనలు చేయాలని మూడు కమిటీలు నిర్ణయించాయన్నారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్లు ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ), ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ప్రతినిధులు సుబ్బరావమ్మ, జె.లలితమ్మ, ఆర్.జ్యోతి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.605	

ప్లాస్టిక్ కవర్‌ల వాడకం పర్యావరణానికి హానికరం

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిర్ధిష్ట మైక్రాన్‌ల కన్న తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్‌ల వాడకంపై నిషేధం ఉందని, ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హానికరమని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణదారునికి రూ.500 జరిమానా విధించారు. మార్కెట్ ఏరియాలో కూల్ డ్రింక్ దుకాణదారులు చెత్తను బయటవేసినందుకు రూ.500 జరిమానా విధించారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.శ్రీనివాసరావుతో కలిసి స్థానిక 1, 22 వార్డులు, టిడ్కో కాలనీలో జరుగుతున్న గ్యాంగ్ వర్క్‌ను పరిశీలించారు.


కవర్లు స్వాధీనం చేసుకున్న శ్రీనివాసరావు

ఆందోళనలో అన్నదాతలు

● ధాన్యంపై పరదాలు కప్పిన వైనం ● మిల్లులకు తరలించేందుకు సిద్ధం చేసిన ధాన్యం

గుడివాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి ధాన్యం అమ్ముకోవటానికి గత పది రోజుల నుంచి చాలా ఇబ్బందులు పడుతున్నారు. తుపాన్ హెచ్చరికలతో చాలా మంది రైతులు మానుగాయ ఉన్న ధాన్యం అయినా కోసేస్తున్నారు. వర్షం వస్తే అవి కూడా దక్కవని ఆత్రుతతో రైతులు మిషన్ల ద్వారా కోసి ట్రాక్టర్లపై రోడ్లపైకి చేర్చుకుంటున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి మండలం మేఘావృతమై ఉండటం చిరుజల్లులు పడటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

వాతావరణ మార్పుల వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాం. నాకు పది ఎకరాలు ఉంది. గతేడాది ఎకరాకు 46 బస్తాలు అయ్యాయి. ఈ ఏడాది 39 బస్తాలే వచ్చాయి. అటు ధాన్యం బస్తాలు తగ్గుదల, ఇటు రేటు లేకపోవటం, ఒక పక్క వర్షం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. పండించిన ధాన్యాన్ని సంచుల్లోకి ఎత్తి ఉంచాం. కొనటానికి ముందుకు రాకపోవటంతో ధాన్యం రక్షించుకోవటానికి రోడ్డుపై పోసి పరదాలు కప్పి ఉంచాము.



కొండపల్లి రంగారెడ్డి, లింగవరం

ముఖ్యంగా బొమ్ములూరు, చిరుచింతల, లింగవరం తదితర గ్రామాల్లో రాశులను రోడ్లపైన, పొలం గట్లపై ఉంచి పరదాలు కప్పారు. సంచులు తెచ్చుకుని ఇళ్లకు, మిల్లులకు చేర్చే పనిలో ఉన్నారు. ఈ ఏడాది హడావిడిగా కోయటంతో ఎకరానికి 5 బస్తాల వరకు దిగుబడి తగ్గుతుందన్నారు. దిగుబడి తగ్గటమే కాకుండా హడావిడిగా మిల్లర్లకు పంపితే రేటు కూడా తక్కువగా ఉంటుందని, అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. భారీ వర్షం వస్తే చేతికొచ్చిన పంట నేల పాలవుతుందన్నారు. అధికారులు స్పందించి తమ ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.

కూచిపూడి: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో శుక్రవారం సాయంత్రం నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కుప్పలు నూర్చి ధాన్యాన్ని రోడ్డు పక్కన ఆరబెట్టగా, మరి కొందరు రైతులు కాటాలు వేసి లారీల కొరత కారణంగా రోడ్ల వెంబడి ఖాళీ ప్రదేశాల్లోనూ, బస్తాల్లో నెట్లుగా కట్టి కాపలా కాస్తున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవటంతో రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల్లో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండటంతో ఎక్కడ ధాన్యం అక్కడే గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. సంచుల కొరత, లారీల కొరతతోపాటు మధ్య దళారులు అడ్డగోలుగా ధరలు తగ్గించి కొనుగోళ్లు చేయటంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు.


రాశులుగా పోసిన ధాన్యం


బస్తాలపై పరదాలు కప్పుతున్న రైతులు


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధర్

శాంతి భద్రతల పరిరక్షణే ముఖ్యం

తోట్లవల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ సందర్శించారు. సీఐ వై చిట్టిబాబు, ఎస్సై ఎం అర్జునరాజుతో సమావేశమై స్టేషన్‌లో కేసుల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో సమావేశమై గ్రామాల్లో పరిస్థితులపై చర్చించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు వచ్చినట్టు ఎస్పీ తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

పామర్రు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో కెజ్యోతి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఒక్కరోజు ముందుగానే శనివారం ఉదయం నుంచి ఇంటింటా పింఛన్లను గ్రామ సచివాలయ ఉద్యోగ సిబ్బంది నూరు శాతం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ సహాయకులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 49 రేషన్ దుకాణాల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం-14, బాపులపాడు-11, ఉంగుటూరు-9, నందివాడ-8, గుడ్లవల్లేరు-3, పెదపారుపూడి-4 ఖాళీలున్నట్లు తెలిపారు. డిసెంబరు 13లోగా ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారాలు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయం లేదా ఆర్డీవో కార్యాలయంలో పొందవచ్చునన్నారు. పూర్తి చేసుకున్న దరఖాస్తులను నేరుగా లేదా పోస్టు ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారి, గుడివాడకు పంపాలని సూచించారు. వివరాలకు ఆర్‌డీవో కార్యాలయంలో అడిగి తెలుసుకోవచ్చునని ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో బొగ్గవరపు విజయకుమార్ జ్ఞాపకార్థం ఆయన తండ్రి తిరుపతయ్య ఆర్థికసాయంతో శుక్రవారం స్థానిక కరుణాపీఠంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు హరికుమార్, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, హరిబాబు, తాతారావు పాల్గొన్నారు.

మెగా పేరెంట్ కమిటీ నిర్వహణకు ఏర్పాట్లు

గుడివాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ కమిటీ సమావేశానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్‌ఐవో మండల ప్రత్యేకాధికారి సాల్మన్ రాజు అన్నారు. శుక్రవారం గుడివాడ రూరల్, అర్బన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెగా పేరెంట్ కమిటీపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథిగా హాజరైన సాల్మన్ రాజు మాట్లాడుతూ డిసెంబరు 7 న పేరెంట్ కమిటీ మీటింగ్ జరుగుతుందని, ఆయా పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు 90 శాతం హాజరు దాటితే ఆ పాఠశాల సమావేశం సక్సెస్ ఫుల్ అని తెలిపారు. ప్రతీ విద్యార్థి హెల్త్ కార్డులు సిద్ధం చేసుకుని ఆయా పిల్లల తల్లిదండ్రులు వచ్చినప్పుడు వారికి ఆరోగ్య విషయాలు తెలపాలన్నారు. పాఠశాల ఆవరణను, పాఠశాల రూమ్‌లను సుందరీకరణగా అలంకరించి ఆహ్లాద వాతావరణాన్ని కల్పించాలని కోరారు. ప్రతీ ఉపాధ్యాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇళ్లకు చేరుకునే వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పేరెంట్ కమిటీ మీటింగ్‌ల్లో రాజకీయాలు ఉండరాదని స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణకు వచ్చిన వారు విద్యార్థుల తల్లిదండ్రులుగానే రావాలని ముందుగానే చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.బాలాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని నిర్వహించడాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ప్రక్రియలను షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రమేష్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో -1 జి.జగన్మోహనరావు, రిసోర్స్ పర్సన్ టి.చంద్రముఖి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌ఐవో సాల్మన్ రాజు

ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే ధర్నా చేస్తాం

● మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం పండించిన రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయటం తగదని, వల్లూరుపాలెంలో 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే ధర్నాకు దిగాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ హెచ్చరించారు. వల్లూరుపాలెంలో ధాన్యాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. మద్దతు ధర రూ. 1,740కి కొనుగోలు చేయాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. మిల్లర్లకు, దళారులకు అనుకూలంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్టు అనిల్‌కుమార్ ఆరోపించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, పలువురు వైసీపీ నాయకులు కైలే వెంట ఉన్నారు.

విలేకరులపై వైస్ ఎంపీపీ చిందులు

ఈ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వచ్చిన విలేకరులపై చాగంటిపాడు ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి చిందులు తొక్కారు. కళ్లంవారిపాలెంలో తాను ఇసుక తోలితే వార్తలు రాశారని, ఇపుడు కళ్లంవారిపాలెం, చాగంటిపాడు క్వారీల్లో టీడీపీ వారు ఇసుక దోపిడీ చేస్తుంటే ఎందుకు రాయటం లేదని కస్సుబుస్సులాడారు. ఈ విలేకరులే వచ్చి ధాన్యం సమస్యలపై వార్తలు రాస్తున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌తో చెప్పారు. మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతు తాము అన్నీ నోట్ చేసుకుంటున్నామని, ఇంకో రెండు నెలల తరువాత మాట్లాడతామని అన్నారు. కాగా ఇసుక విషయంలో టీడీపీ, వైసీపీ కుమ్మక్కు రాజకీయాలు నడుపుతున్నట్టు బహిరంగంగా ఆరోపణలు వస్తుంటే వాటికి వైసీపీ నాయకులు సమాధానం చెప్పలేకపోవటం విశేషం.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ఉచిత మెగా వైద్యశిబిరం రేపు

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో పాలకవర్గ వ్యవస్థాపక కార్యదర్శి కాజ వెంకట్రామయ్య జ్ఞాపకార్థం డిసెంబరు 1న పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి విజయవాడ ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.సంపత్‌కుమార్ కోరారు.


పరిశీలిస్తున్న ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు

సంపద తయారీ కేంద్రం పరిశీలన

పమిడిముక్కల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేడూరులో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని తక్షణమే ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.


స్తంభాన్ని నిలబెడుతున్న సిబ్బంది

స్తంభాన్ని నిలబెట్టారు

నందివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం వేసిన రోజే ఒరిగిపోయిందని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయమే కాంట్రాక్టర్‌తో ఒరిగిన స్తంభాన్ని మార్చి పక్కనే నిలబెట్టారు. ఈ సందర్భంగా ఏడీ గోవిందరావు మాట్లాడుతూ పంచాయతీ వారు పైపులీకు పని మీద స్తంభం పక్కనే గొయ్యి తీయటంతో స్తంభం ఒరిగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐ సాయిబాబు, లైన్‌మన్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా బజారు ప్రారంభం

గుడివాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను స్థాపించారని, మహిళలు ఆర్థిక ఎదుగుదల ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయని మున్సిపల్ మాజీ చైర్మన్, ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను యలవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 స్వయం సహాయక సంఘాలు ఈ విధంగా ఆర్థిక అభివృద్ధికి అడుగులు వేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, రెడ్డి షణ్ముఖ్, ఆదినారాయన, సీఎంఎం బసమేశ్వరరావు, పట్టణ సమైక్య అధ్యక్ష,కార్యదర్శులు ప్రతిమ, అంజమ్మ, మెప్మా సీవోలు, టీఎల్ఎఫ్ సభ్యులు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.


మెప్మా బజారును ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

వైభవంగా శివపార్వతుల శాంతి కల్యాణం

కూచిపూడి,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవి శ్రీ అన్నపూర్ణా సమేత సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్థుల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరణ, విశేష పూజలు, కల్యాణ మహోత్సవ వేడుకలు జరిగాయి. జొన్నలగడ్డ మల్లికార్జునరావు దంపతులు పీటల మీద కూర్చుని పూజలు నిర్వహించారు. అనంతరం శాంతకుమారి కుటుంబసభ్యులు నాగమణి, నాగమల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

లక్ష బిల్వార్చన

స్థానిక బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో వేదపండితులు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి అన్నాభిషేకం, నందీశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వేలం పాట ద్వారా రూ.7,07,500 లక్షల ఆదాయం

పెదపారుపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువు పాటల వల్ల పంచాయతీకి ఆదాయం చేకూరుతుందని వంగ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొర్నిపాడు గ్రామపంచాయతీకి చెందిన చెరువులలో చేపలు పెంచుకునేందుకు వేలం పాటలు నిర్వహించినట్లు పెదపారుపూడి ఈవోపీఆర్‌డీ వంగా శ్రీనివాస్ తెలిపారు. 2024-25 నుంచి 2026 -27 వరకు మూడేళ్ల కాలపరిమితికి రూ.7,07,500 ఆదాయం రానున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ దూడల లోకేశ్వరి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జి.బి.రాజేంద్ర ప్రసాద్ వేలం పాటలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా కార్తీక వన సమారాధన


బిల్వార్చనలో పాల్గొన్న పురోహితులు

పామర్రు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పామర్రు పట్టణంలో ఉన్న శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పామర్రు బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేక సహిత లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివార్లకు రుద్రహోమం సహస్ర కుంకమార్చన జరిపారు. అనంతరం టీడీపీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు సుబ్బారావు ఇంటి ఆవరణలో బ్రాహ్మణ సంఘీయులు కార్తీక వన సమారాధన పురస్కరించుకుని అన్న సమారాధన చేశారు. నిమ్మకూరు శివాలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, డాక్టర్ తేజ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

మమతా వృద్ధాశ్రమంలో అన్నదానం

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మమతా వృద్ధాశ్రమం, ఏజీకే పాఠశాల పక్కన ఉన్న అన్నక్యాంటీన్లలో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొట్లూరి సీతారామదాసు, కమలాదేవి దంపతులు, యలమంచిలి వెంకటచలపతిరావు, సీతారత్నంల జ్ఞాపకార్థం పొట్లూరి రామకృష్ణారావు, లక్ష్మీ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, లక్ష్మీ దంపతులు, జిల్లా అధ్యక్షుడు దండమూడి జయలక్ష్మీ, గుడివాడ అధ్యక్ష, కోశాధికారులు అన్నపురెడ్డి గోపిరెడ్డి, గంటా చంద్రశేఖరరావు, సభ్యులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న సీతారామదాసు దంపతులు

చెత్తను శుభ్రపరచండి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంజీఎం, ఎస్‌పీఎస్ మున్సిపల్ దుకాణ సముదాయాలను శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తనిఖీలు చేపట్టారు. ఈ రెండు దుకాణ సముదాయాల పైకి వెళ్లి పరిశీలించి పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక జీవి మాల్‌లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణను పరిశీలించారు. ఫైర్ ఫైటింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. 1,14,15,36 వార్డుల్లోని సచివాలయాలను సందర్శించారు. బిల్ కలెక్టర్‌లతో పాటు అడ్మిన్, ప్లానింగ్, ఎమినిటీస్, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జునరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ సర్టిఫికెట్‌పై విచారణ

నందివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిరిశ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ సర్టిఫికెట్‌పై విచారణ జరిగింది. తమిరిశ సర్పంచ్ తప్పిట ధనలక్ష్మి క్రిస్టియన్ మాల కాదని, దొంగ సర్టిఫికెట్ పుట్టించి పోటీ చేసిందని టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన కారే వెంకట రమణ స్పందనలో ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. మండల ఎంపీడీవో మల్లేశ్వరి పంచాయతీ విస్తరణ అధికారి మోహమ్మద్ బాషా ఇరువర్గాలను పిలిపించి విచారించారు. ఈ విషయంపై ఎంపీడీవో మల్లేశ్వరిని వివరణ కోరగా, ధనలక్ష్మి చదువుకున్న పాఠశాలను పరిశీలించి సర్టిఫికెట్లు పై అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.


ఆలయంలో లక్షదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

లక్ష దీపోత్సవం

గుడ్లవల్లేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం రాత్రి వడ్లమన్నాడు గ్రామంలోని ద్రోణేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ దీపార్చన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.605	

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ

అవనిగడ్డ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య శుక్రవారం అవనిగడ్డ సబ్ జైలును సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌకర్యాల గురించి ఆరా తీసిన ఆయన వారికి నాణ్యమైన భోజనం అందుతుందా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్, జైలర్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య

వైభవంగా కార్తీక దీపోత్సవం

- పృథ్వీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మాస శివ రాత్రి కావటంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పృథ్వీశ్వర క్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అర్చక బృందం, పండిత బృందం స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమగ్రాభివృద్ధి దాత మండవ రవీంద్ర, ప్రముఖులు యార్లగడ్డ గోపాల్, మేకా దశరధ రామయ్య, దాతల సహకారంతో భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చల్లపల్లిలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు.





మోపిదేవిలో సహస్ర దీపోత్సవాన్ని వెలిగించి ప్రారంభిస్తున్న ఈవో దంపతులు.. స్వామి వారికి ప్రత్యేక పూజలు

సుబ్బారాయుడికి లక్ష బిళ్వార్చన

మోపిదేవి : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి బిళ్వార్చన మహోత్సవం నిర్వహించారు. గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం చందనాభిషేకం, బిళ్వార్చన జరిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని లోకకల్యాణార్థం బిళ్వార్చన మహోత్సవం నిర్వహించగా, పలు ప్రాంతాలనుంచి విచ్చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు జరిపారు. అనంతరం సహస్ర దీపోత్సవాన్ని ఆలయ ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ ఆధ్వర్యంలో సహాయకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



స్పటిక మాలలతో స్వామివారికి అభిషేకాలు

నగరేశ్వరస్వామి ఆలయంలో..

నాగాయలంక : నాగాయలంకలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరుగుతున్నాయి. శుక్రవారం బిల్వ దలాల, వివిధ పూలతో పుష్పాభిషేకాలు, స్పటిక మాలలతో అభిషేకాలు వైభవంగా జరిగాయి. భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమాలను చైర్మన్ చిట్టా సాంబశివరావు తదితరులు పర్యవేక్షించారు.

● గణపేశ్వరంలోని దుర్గా గణపేశ్వర స్వామి దేవస్థానంలో శివునికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. తలగడదీవి భవాని పెట్రోలు బంక్ వారి ఆర్థిక సహాయంతో సుమారు వెయ్యి మందికి పైగా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.



గూడూరులో కోటి దీపోత్సవం

రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో

గూడూరు : కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం గూడూరులో వేంచేసియున్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం కోటి దీపోత్సవం నిర్వహించారు.

జలధీశ్వరస్వామికి అభిషేకాలు

ఘంటసాల : బాలపార్వతీ సమేతజలధీశ్వరస్వామి దేవాలయంలో అన్నాభిషేకం, రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు చావలి కృష్ణకిషోర్ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

గీతా మందిరంలో..

అవనిగడ్డ : గీతా మందిరంలో లక్ష్మీ నరసింహస్వామికి శుక్రవారం శాంతి కల్యాణం నిర్వహించారు. బెజవాడ ధన సురేష్ దంపతులతోపాటు 50 మంది దంపతులు పాల్గొనగా, కన్నుల పండువగా కల్యాణం జరిపారు. అంతకు ముందు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించగా, శాంతి, సుదర్శన, వాస్తు హోమాలను వైభవంగా నిర్వహించారు.



శాంతికళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

నాగాయలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పర్రచివర గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త బొండాడ గ్రూప్స్ అధినేత డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావు ఆర్థిక సాయంతో ఇటీవల వృద్ధులకు, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 400 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. శుక్రవారం రాఘవేంద్రరావు పుట్టినరోజు సందర్భంగా శ్రీరామపాద క్షేత్రంలో అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ద్వారా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. నిర్వాహకులు శేషగిరిరావు, తలశిల రఘు శేఖర్, నక్కా విజయబాబు, నారాయణ పాల్గొన్నారు.



ఆర్టీసీ చైర్మన్ నారాయణరావుకు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నేతలు

కోడూరు - మచిలీపట్నం ఆర్టీసీ సర్వీస్ నడపండి

కోడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నుంచి కోడూరుకు ఆర్టీసీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని కూటమి నాయకులు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కోరారు. మచిలీపట్నంలో నారా యణరావును శుక్రవారం కోడూరు మండల కూటమి నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. కోడూరు నుంచి మచిలీపట్నం వెళ్లాలంటే అవనిగడ్డ, చల్లపల్లి మీదుగా చుట్టూ తిరిగి 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. మర్రె గంగయ్య, కోట రాంబాబు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యార్లగడ్డ గ్రామంలో వరిలో మానిపండు తెగులు, యాజమాన్యంపై క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయ కర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు శిక్షణ కార్యక్రమంలో విరివిగా రైతులకు తెలియజేయాలని సూచించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట లక్ష్మి, డాక్టర్ నవీన్ పొలంలో వచ్చే దిగుబడిని సుమారుగా అంచనా వేశారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమ ణి, ఏడీఏ శ్రీనివాస్, ఏవో పద్మజ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి

రహదారి పనుల పరిశీలన

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రహదారులు అభివృద్ధి చెందుతున్నాయని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. చల్లపల్లి నుంచి వెంకటాపురం గ్రామ సమీపం వరకు ఉన్న రోడ్డు అభివృద్ధి పనులను డీఈఈ రమేష్ పర్యవేక్షణలో చేపట్టారు. రూ.53 లక్షలతో చేపట్టిన ఈ పనులను సర్పంచ్ శుక్రవారం పరిశీలించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, రావి చిట్టి, జనసేన పట్టణ అధ్యక్షులు బొందల పాటి వీరబాబు, అడపా రవి పాల్గొన్నారు.

మండలిపురంలో..

అవనిగడ: మండలిపురంలో ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను అవనిగడ్డ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు శుక్రవారం పరిశీలించారు.

యువకుడి మృతదేహం లభ్యం

మోపిదేవి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన పడమట సుబ్రహ్మణ్యం బుధవారం రాత్రి 9వ నెంబర్ కాల్వలో గల్లంతు కాగా, శుక్రవారం ఉదయం మచిలీపట్నం మం డలం యాదర వద్ద మృతదేహం లభ్య మైనట్లు పోలీసులు తెలిపారు. మోపిదేవి ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం, పడమట సుబ్రహ్మణ్యం, వీరంకి సుబ్బారావు కాల్వ వంతెనపై కూర్చుని ఘర్షణ పడ్డారు. ఇద్దరూ మధ్య తోపులాట జరగగా వారు కాల్వలో పడిపోయాడు. గ్రామస్థులు ఇరువురిని రక్షించే ప్రయత్నంలో వీరంకి సుబ్బారావును బయటికి లాగగా, సుబ్రహ్మణ్యం గల్లంతయ్యాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మర్యాద పూర్వక కలయిక

పెడన, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు శుక్రవారం ముడా చైర్మన్ మట్టా ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మట్టా ప్రసాద్ పెడన చేనేత పరిశ్రమ గురించి కమిషనర్ గోపాలరావును అడిగి తెలుసుకున్నారు.

15 నుంచి చల్లపల్లిలో సీపీఎం జిల్లా మహాసభలు

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కృష్ణాజిల్లా 25వ మహాసభలు డిసెంబరు 15, 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు మహాసభల ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. చల్లపల్లిలోని గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, చల్లపల్లిలో జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు, ఆహ్వాన సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, మోపిదేవి, ఘంటసాల, కోడూరు మండలాల కార్యదర్శులు బండి ఆదిశేషు, మేడంకి వెంకటేశ్వరరావు, పోలాబత్తిన మోహనరావు, చల్లపల్లి మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం నూతన కమిటీ ఎన్నిక

మచిలీపట్నం టౌన్ : సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శిగా బి. సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు ఎన్నిక నిర్వహించారు. సుబ్రహ్మణ్యంతో పాటు మరో 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సి.హెచ్. రాజేష్, టి. చంద్రపాల్, సి.హెచ్. జయరావు, ఆర్. వెంకట్రావు, ఎ. రమాదేవి, ఎం.డి.యూనస్, కొడాలి సుజాత, పేటేటి రాజు, టి. చాందిని దుర్గ, దాసి రాధలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి వై. నరసింహారావు ఆధ్వర్యంలో 13 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. రాజుపేటలో ఉన్న డంపింగ్ యార్డును రుద్రవరానికి తరలించి కరెంటు కాలనీలోని ప్రజలకు న్యాయం చేకూర్చాలన్నారు.

ప్రజానాయకుడు కోటి సూర్యప్రకాశరావు

పెడన/పెడన రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రకాశరావు చూపించిన చొరవ ప్రశంసనీయమని మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. నల్లమోతు కోటి సూర్యప్రకాశరావు విగ్రహావిష్కరణ చేవేంద్రలో శుక్రవారం జరిగింది. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రకాశరావు సమితి అధ్యక్షుడిగా, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా అనేక పదవులు పొంది గ్రామాభివృద్ధికి కృషి చేశాడన్నారు. వేదవ్యాస్, యార్లగడ్డ వెంకట్రావు, పిన్నమనేని వెంకటేశ్వరరావులు ప్రకాశరావుతో తమకుగల అనుభంధాన్ని గుర్తుచేసుకున్నారు. బూరగడ్డ శ్రీకుమార్, గుడిశేవ రామారావు, అంబటి కాంతారావు, పిన్నెంటి మహేష్, జన్ను నాగమల్లేశ్వరరావు, గరికపాటి రామానాయుడు పాల్గొన్నారు.



ప్రకాశరావు విగ్రహం ఆవిష్కరిస్తున్న వేదవ్యాస్, ఎమ్మెల్యే యార్లగడ్డ తదితరులు

పెడనలో మెప్మా బజార్ ఏర్పాటు

పెడన : పెడన మునిసిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం అర్బన్ మహిళా మార్కెట్ (మెప్మా బజార్) ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించి అమ్మకాలు జరిపారు. కమిషనర్ ఎం. గోపాలరావు, కౌన్సిలర్ కటకం ప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు ఆకురాతి జనార్ధన్ తదితరులు పరిశీలించారు.



ఒంటరి మహిళలు అప్రమత్తంగా వుండాలి

ఉంగుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన చిల్లరదుకాణాలు, తోపుడు బండ్లపై చిరువ్యాపారాలు నిర్వహించే ఒంటరి మహిళలు చైన్ స్నాచర్ల విషయంలో అప్రమత్తంగా వుండాలని, మెడలో ధరించిన బంగారు గొలుసులు, ఇతర నగలు చైన్ స్నాచర్లు లాక్కెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆత్కూరు ఎస్సై చావా సురేష్ సూచించారు. రోడ్డు పక్కన వివిధ రకాల చిరువ్యాపారాలు నిర్వహిస్తున్న ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకుని వారి మెడలలో వున్న బంగారు గొలుసులు తెంపుకుపోతున్న సంఘటనలు పరిసర ప్రాంతాల్లో జరిగిన దృష్ట్యా ఎస్సై తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఆత్కూరు, పెదఅవుటపల్లి, పొట్టిపాడు, తేలప్రోలు తదితర గ్రామాల్లో ప్రత్యేక పగటి పహారాలు నిర్వహించారు. బంగారు గొలుసులు చైన్ స్నాచర్ల పాలుకాకుండా ఒంటరి మహిళలు అప్రమత్తంగా వుండాలని ఎస్సై సూచించారు.

క్రికెట్ పోటీలకు విశేష స్పందన

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు తమ ప్రతిభను చూపిస్తున్నారు. పార్ట్‌టైం ప్లేయర్స్ జట్టుతో రాడార్ రెవిగేట్స్ జట్టు తలపడింది. మొదటి ఇన్నింగ్‌లో రాడార్ రెవిగేట్స్ జట్టు 9.5 ఓవర్లకు 87 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. తరువాత ఇన్నింగ్‌ను ప్రారంభించిన పార్ట్‌టైమ్ జట్టు చివరి బంతికి రెండు పరుగులు చేసి మూడు వికెట్లతో గెలుపొందింది. మహారాజు జట్టు కృష్ణా యూనివర్సిటీ జట్టుతో తలపడింది. మహారాజ్ జట్టు 10 ఓవర్లలో 90 పరుగులకు రెండు వికెట్లు కోల్పోగా, కేఆర్‌యూ జట్టు 10 ఓవర్లలో 86 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది. మహరాజ్ జట్టు 9 పరుగుల తేడాతో విజయం సాధించారు. యంగ్ ఛాలెంజర్స్ జట్టు వడ్లమన్నాడు క్రికెట్ లవర్స్ జట్టుతో తలపడ్డారు. మొదటి ఇన్నింగ్స్‌లో యంగ్ చాలెంజర్స్ 10 ఓవర్లకు 68 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోగా, వడ్లమన్నాడు క్రికెట్ లవర్స్ జట్టు 8.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో గెలుపొందింది.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పోటీ ప్రపంచంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు సాధించాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ వాసా వెంకటేశ్వరరావు అన్నారు. జైహింద్, ఎస్ఆర్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు అత్యవసర సేవల కోసం 100, 112కు డయల్ చేయవచ్చన్నారు. బాల్య వివాహాలు జరిపితే చట్ట రీత్యా తగిన శిక్ష విధిస్తారన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, శక్తి టీమ్‌లు పాల్గొన్నాయి.



మాట్లాడుతున్న సీఐ వాసా వెంకటేశ్వరరావు

స్వచ్ఛ చల్లపల్లితో అందంగా మారింది: శాంటో

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి చాలా అందంగా ఉందని 'స్టాండ్ అప్ రాహుల్' చిత్ర దర్శకుడు వీరంకి సంతోష్ మోహన్ (శాంటో) అన్నారు. చల్లపల్లిలోని జాతీయ రహదారి -216పై శుక్రవారం పెద్దకళ్లేపల్లి రోడ్డు వైపు స్వచ్ఛ సుందర్య చల్లపల్లి కార్యక్రమం జరిగింది. మోపిదేవి మండలం పెద్దకళ్లేపల్లి శివారు కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన వీరంకి సంతోష్ మోహన్ బృందంతో ఈ ప్రాంత సందర్శనకు వచ్చిన సందర్భంగా స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం గురించి తెలుసుకుని కార్యక్రమానికి హాజరై శ్రమదానం చేశారు. హైవే పక్కన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాల క్రితం తాను చూసిన చల్లపల్లికి ఇప్పుడు చూస్తున్న చల్లపల్లికి అస్సలు పోలిక లేదన్నారు. డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ - డాక్టర్ టి.పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యకర్తలు తెల్లవారుజామున నిద్రలేచి గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత, సుందరీకరణకు కృషి చేయటం గర్వంగా ఉందన్నారు. చల్లపల్లి ఇంత శుభ్రంగా ఉండటం సంతోషం కలిగించిందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వచ్ఛ చల్లపల్లిలో దర్శకుడు సంతోష్ మోహన్ (శాంటో)

బర్రంకులలో పశువైద్య శిబిరం

నాగాయలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగభూషణం అన్నారు. జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా గణపేశ్వరం శివారు బర్రంకుల గ్రామంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం జరిగింది. 56 పశువులలకు డీడీ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాసరావు, సాయి మౌనిక పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మమతానాగిరెడ్డి

యువత, మహిళలకు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి గల యువత, మహిళలకు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మమతానాగిరెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ అనే వాల్‌పోస్టర్లను యువ జన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జోనల్ ఇన్‌చార్జి టి.సందీప్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అబ్దుల్ మతీన్, మచిలీపట్నం యువజన కాంగ్రెస్ నాయకుడు రామచంద్రరావు, యువ జన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, రామ్‌సింగ్, కృష్ణ, ఎన్. శామ్యూల్, మట్టా దత్తుడు, చిలుకోటి ప్రసాద్, మహమ్మద్ ఆరీఫ్ పాల్గొన్నారు.